పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసిన కలెక్టర్ శరత్

నవతెలంగాణ-సంగారెడ్డి

గ్రేడ్ - 111 గ్రామ పంచాయతీ బొర్గి, మం. కంగ్టి చెందిన పంచాయతీ కార్యదర్శి ఆర్. జయరాం విధులకు అనధికారికంగా గైర్హాజరయ్యారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమ నిర్వహణలో విఫలం అయినందున విధుల నుండి సస్పెండ్ చేస్తూ గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి సంగారెడ్డి సందర్శనలో డి.వి. సాధన, జూనియర్ పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ కొడకంచి, మం. జిన్నారం, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమములో అలసత్వం, నిర్లక్ష్యం వహించినందున అవెన్యూ ప్లాంటేషన్ నిర్వహణలో, మురికి కాలువలు మరియు రోడ్లు శుభ్రపర్చుటలో విఫలం అయినందున, క్యాష్ బుక్ నిర్వహణలో విఫలం అయినందున, ఇళ్ళ నుండి రోజూ ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ తడి/పొడి చెత్త వేరు చేయుటలో, డంపింగ్ యార్డ్ నిర్వహణ చేయుటలో విఫలం అయినందున విధుల నుండి సస్పెండ్ చేయుచూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినారు. సర్పంచ్, ఉప సర్పంచ్ గ్రామ పంచాయతీ కొడకంచి, మం. జిన్నారం కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలో ఏ గ్రామ పంచాయతీలో అయినా ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణలో గానీ మొక్కల పెంపకములో నిర్లక్ష్యం వహించిన, విధులకు ఉదయము 7 గంటల లోపు హాజరు కాకపోయినా కఠిన చర్యలు తీసుకోగలమని హెచ్చరించారు. సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాలను శుభ్రంగా, పచ్చగా వుంచుటలో శ్రద్ధ వహించవలెను అని కలెక్టర్ ఆదేశించారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా

నవ తెలంగాణ మెదక్ టౌన్



ప్రమాదవశాత్తు ధాన్యం లోడుతో వెళ తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని స్థానిక బస్ డిపో వద్ద చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కు స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి బస్టాండ్ వైపు వెళుతున్న ట్రాక్టర్ ఎక్సెల్ విరిగిపోవడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సంచులు రోడ్డుపై చల్లా చదురుగా పడిపోయాయి. రోడ్డుపై అడ్డంగా ట్రాక్టర్ బోల్తా పడడంతో కొద్దిసేపు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది.

1

నవతెలంగాణ



మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం 19 మే 2023



వందల కోట్లు దోచిండ్రు... కలలు కూల్చిండ్రు

- రూ.300 కోట్లపైనే రియల్ దందా
- ఐలాపురం వివాదాస్పద భూమిని నోటరీ పేర అమ్మకం
- అమాయకుల్ని నమ్మించి దండుకున్న నాయకులు
- 1500పైనే ప్లాట్ల విక్రయాలు
- 50 శాతం ఇళ్ల నిర్మాణాలు
- ప్లాట్ల అమ్మినోళ్లపై..
- కరెంట్ మీటర్, నీళ్లు బిల్లు, ఇంటి నెంబర్ ఇచ్చినోళ్లపై చర్యలేవీ?

పేదల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వివాదాస్పద భూమిని అంటకట్టింద్రు. ఎవరూ రారు.. మేమున్నామంటూ నోటరీ పత్రాల మీద ప్లాట్లు అమ్మింద్రు. ఇళ్లు కట్టుకోమని చెప్పింద్రు. రోడ్లు వేసింద్రు. నీళ్లిచ్చింద్రు. కరెంట్ మీటర్లు పెట్టింద్రు. ఇంటి నెంబరిచ్చింద్రు. గుడి కడితే భూమిపూజ చేసింద్రు. ఇంత జరిగాక ఇక మా సొంతింటి కల నెరవేరిందని పేదలు ఆశపడింద్రు. ఇంతలో బుల్డోజర్లు పెట్టి పేదల కలల గూడును నేల కూల్చింద్రు. ఇంకేముంది రెక్కలు ముక్కలు చేసుకుని పోగేసుకున్న సొమ్మంతా పట్టిపాలైంది. బోరున విలపించడం తప్ప దిక్కుతోచని పరిస్థితిలోకి పేదలు నెట్టబట్టారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఐలాపురం, ఐలాపురం తండాలో 119 సర్వే నెంబర్‌లోని భూమి పూర్వం ఎవరిది? అది ఎవరికి ఏ పద్ధతిలో సక్రమించింది? హక్కుదారులెవరు? అనే వివాదాన్ని కోర్టు తేల్చుతుంది. ఆ చర్చను పక్కన పెడితే... వేల మంది పేదలు రోడ్డున పడిన ధీన పరిస్థితి గురించి మాట్లాడుకుందాం. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలకు పేదల సమస్య పట్టదా? అక్కడ ఎనిమిదేళ్ల నుంచి వివాదాస్పద భూమిలో క్రయవిక్రయాలు, ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. 1500 ప్లాట్ల వరకు అమ్మకాలు జరిగాయి. ఇదంతా రాత్రికి రాత్రి రాహస్యంగా జరగలేదు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, విద్యుత్ అధికారులకు తెలుసు. ఎమ్మెల్యే నుంచి మండల ప్రజాప్రతినిధులు, స్థానిక సర్పంచ్ వరకు ఈ ప్లాట్ల దందాలో ప్రత్యక్ష, పరోక్షంగా ఉన్నారనే విమర్శ ఉంది.

రూ.300 కోట్ల పైనే దందా

ఐలాపురం, ఐలాపురం తండా పరిధిలో 1500 ప్లాట్ల వరకు అమ్మకాలు జరిగాయి. గజం ధర కనీసం రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకు కొనుగోళ్లు చేశారు. అక్కడ భూమి పట్టాదారులుగా కొందరు నోటరీ పత్రాలతో ఒక్కో ప్లాట్ ధర సగటున రూ.20 లక్షల వరకు అమ్మారు. అంటే రూ.1500 ప్లాట్లకు గాను రూ.300 కోట్ల వరకు అక్కడ ప్లాట్ల అమ్మకాల ద్వారా దండుకున్నారు. అంత డబ్బు ఎవరి చేతులకెళ్లిందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తమకు అసైన్డ్ చేయబడిందని కొందరు ఎస్టీ రైతులు క్లెయిమ్ చేసుకుని అమ్మకాలు చేసినా వ్యవహారమంతా నడిపింది మాత్రం స్థానిక ప్రజాప్రతినిధి, ఇతర మధ్యవర్తులే అని అక్కడ ప్లాట్లు కొని నష్టపోయిన బాధితులు చెబుతున్నారు. వందల కోట్ల దందా వెకనాల అధికారులు, పెద్ద ప్రజాప్రతినిధుల మనుషులున్నారని చెబుతున్నారు.

వివాదస్పద భూమి అయినప్పుడు అనుమతులెలా ఇచ్చారు?


119 లోని భూమి కోర్టు వివాదంలో ఉందని ప్రభుత్వ అధికారులకు తెలుసు. స్థానిక సర్పంచ్, ఇతర వ్యక్తులు, ఎమ్మెల్యే అధికార పార్టీ నేతలకు కూడా తెలుసు. మరి సర్పంచ్ తన సమక్షంలో ప్లాట్లను ఎలా అమ్మగలిగారు. ప్లాట్లు కొనుగోలు చేసేందుకు నోటరీ పత్రాలు తయారు చేసింది ఒక న్యాయవాది అంటే ఆయన ఎలా ధృవీకరించారనేది ప్రశ్న. ఇళ్లు కట్టుకున్న వాళ్లకు పంచాయతీ రికార్డుల్లో ఇంటి నెంబర్ ఇచ్చారు. ప్లాట్ కొనుగోలు చేసిన వ్యక్తి పేరు ఇంటి యజమానిగా రికార్డులో ఎలా నమోదు చేశారు..? పన్నులు ఎలా కట్టించుకున్నారు..? పంచాయతీ కార్యదర్శికి కోర్టు వివాదంలో ఉన్న భూమిలో కట్టిన ఇళ్లకు నెంబర్ ఇవ్వకూడదని తెల్వదా..? విద్యుత్ అధికారులు స్తంబాలేయడం, ఇంటికి మీటర్లు పెట్టడం ఎలా జరిగింది..? గుడి కడితే ముఖ్య ప్రజాప్రతినిధి సోదరుడు ఎలా శంకుస్థాపన చేశారు..? రోడ్లు వేయడానికి ఎవరి అనుమతి తీసుకున్నారు..? అక్కడ ప్లాట్లు కొనవద్దు, అమ్మవద్దు అని ఫ్లెక్సీలు పెట్టిన రెవెన్యూ అధికారులు స్థానికంగా ఇళ్లు కడుతుంటే ఎందుకని పోలీసులక పిర్యాదు చేసి ఆపలేదు. ఇళ్లు కట్టిన వాళ్లపై చర్యలు ఎందుకు తీసుకోలేదు..? పోలీసులకు అక్కడ ఇళ్ల నిర్మాణం జరుగుతున్నది తెల్వదా..? తరచూ గ్రామాల్లో తిరిగే ఎమ్మెల్యేకు ప్లాట్లు కొనుగోళు ,, ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నది కనిపించలేదా..? అప్పుడే ఎందుకు వద్దని ఆపలేదు..? ఇళ్లు కూలి ఏడుస్తున్న వాళ్లతో మీటింగ్ పెట్టి ఆ భూమి కోర్టు వివాదంలో ఉందని చావుకబురు సల్లగా చెప్పడం దేనికీ..? ప్లాట్ల అమ్మకాలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంలో భాగస్వాములైన వీరందరిపై కోర్టు దిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదు..? 'నేరం అందరిదీ శిక్ష మాత్రం పేదలకేనా'..?

మానవహక్కుల ఉల్లంఘన



ఐలాపురం, ఐలాపురం తండాలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందనే చెప్పాలి. యూపీ, బీహార్, ఏపీ రాష్ట్రాలు, తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, ఇతర జిల్లాల నుంచి బతుకుదెర్వు కోసం పటాన్‌చెరు ఏరియాకు బతుకొచ్చింద్రు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు, కంపెనీ కార్మికులు, వీధి వ్యాపారాలు చేసుకునే పేదలు అద్దెలు కట్టలేక సొంత గూడు కోసం కొంత డబ్బు పోగేసుకున్నారు. తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తున్నమని చెప్పడంతో నమ్మి కొనుకున్నారు. అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నారు. ఇళ్లల్లో ఉంటున్న వేళ రాత్రి పూట వచ్చి బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేశారు. ఇళ్లల్లో నిత్యవసర వస్తువులు, కూలీర్లు, ఫ్యాన్లు, కుర్చీలు, నీళ్ల ట్యాంకులు, బట్టలు ఏవీ తీసుకునే అవకాశంలేకుండా కూల్చేశారు. వృద్ధుల్ని ఈడ్చిబయటేశారు. కాళ్లమీద పడి ప్రాధేయపడినా కనికరించలేదు. వందల ఇళ్లను నేలమట్టం చేసి విధ్వంసం సృష్టించిన తీరు సోషల్ మీడియా, పత్రికల్లో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే సీపీఐ(ఎం) నాయకులు రెండు సార్లు కూల్చిన ఇళ్లను పరిశీలించారు. బాధితుల్ని కలిసి మాట్లాడి ధైర్యం చెప్పారు. న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మానవహక్కుల ప్రతినిధుల బృందం పరిశీలనకు రానుంది. ఇప్పటికే అక్కడ జరిగిన దృశ్యాలను ట్విట్టర్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని మంత్రులు, గవర్నర్, రాష్ట్రపతికి పంపి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.









వీవోఏల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా.
-సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్



వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్, తదితర సమస్యలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, ఏపీఎం, సీసీల వేధింపులను అరికట్టాలని కోరుతూ గురువారం కలెక్టర్ కార్యాలయం ముందు సీఐటీయు సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి డిమాండ్లతో కూడిన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కాముని గోపాల స్వామి మాట్లాడుతూ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలన్నారు. గ్రామాలలో మహిళల చేత గ్రూపులు, సంఘాలు ఏర్పాటు చేయడంలోను, ప్రభుత్వము అందించే ప్రతి పథకాన్ని ప్రభుత్వానికి మహిళలకు మధ్య వారధిగా ఉంటూ పని చేస్తున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని రద్దు చేయడము ఏమిటి అని ప్రశ్నించారు. వివోఏ లకు రూ. 10 లక్షల సాధారణ,ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రూ.5లక్షలు కల్పించాలని, మహిళలకు ఇచ్చినటువంటి రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు ఈ సమావేశం లో జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య,జిల్లా ఉపాధ్యక్షులు దాసరి కళావతి,జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్,కిష్టయ్య, చెంద్రకళ మంజుల, శంకర్,భాగ్య, పుష్ప,జమున, నిఖిత, ఎల్లస్వామి, జ్యోతి,కనకయ్య, జహీదా, వినోద,శ్రీలత పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి రైతు హల్చల్

శిలాజినగర్ గ్రామంలో ఘటన

నవతెలంగాణ దుబ్బాక రూరల్



సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం శిలాజి నగర్ గ్రామంలో ట్యాంక్ పైకెక్కి ఒక రైతు హల్చల్ చేశాడు. గ్రామ సర్పంచ్ తన భూమి కాగితాలను దగ్గర పెట్టుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నాడంటూ.. పెంబర్తి కనకయ్య అనే రైతు వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని బెదిరించాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి దుబ్బాక పోలీసులు చేరుకుని కనకయ్యను నచ్చజెప్పి వాటర్ ట్యాంక్ పై నుంచి కిందకి దింపి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఐతే అదే గ్రామానికి చెందిన 15 మంది రైతుల భూములను సర్పంచ్ మాడురీ శ్రీనివాస్ తన పేరుమీద చేసుకున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు.

నా భూమి నాకు కావాలి



నా తండ్రి అమాయకత్వాన్ని అడ్డుపెట్టుకుని సర్పంచ్ శ్రీనివాస్ మాకు చెందాల్సిన భూమిని తన పేరు మీద చేయించుకున్నాడు.209 సర్వే నంబర్లో మాకు రావాల్సి భూమిని గురించి గతంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ చేయగా.... తమకు రావాల్సిన భూమి ఇస్తానని నమ్మబలికాడు. పంచాయతీ తీర్మానంలో రాసి ఇచ్చిన కాగితాలు ఇవ్వండి, చూపించండి అని అడిగితే లేవు,పోయా యంటూ సర్పంచ్ సమాధానాలు చెబుతున్నాడు.దీంతో మాకు అన్యాయం జరిగిందని మనస్పర్ధముతో ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను. మా తాతల నుండి వారసత్వంగా ఉన్న ఎకరం భూమిలో ఇల్లు కట్టుకోగా మిగిలిన 30 గుంటల భూమి మాది మాకు కావాలి.ఈ భూమి 209 సర్వే నంబర్లో ఉంది. ఆ సర్వే నంబర్లో మొత్తం 20 ఎకరాల 20 గుంటల భూమిలో మాలాగా అన్యాయానికి గురైన రైతులు మరెందరో ఉన్నారు. అధికారులు స్పందించి మా భూమి నాకు ఇప్పించాలని కోరుతున్నాను

- బాధిత రైతు పెంబర్తి కనకయ్య

నాకు ఎలాంటి సంబంధం లేదు



గత మూడు సంవత్సరాల క్రితం పెంబర్తి కనకయ్య వారి అన్నదమ్ముల భూములకు సంబంధించి పంచాయితీ విషయంలో పెద్దమనుషులు తీర్మానం చేసిన దగ్గర కాగితాన్ని ఓ పెద్దమనిషిగా నా దగ్గర ఉంచారు. ఐతే ఆ కాగితం గ్రామ పంచాయతీలో మిస్సయింది. ఇప్పుడు కనకయ్య ఆ కాగితం కావాలని బెదిరిస్తూ... చస్తానని వాటర్ ట్యాంక్ ఎక్కాడు. పోలీస్ స్టేషన్లో అడగగా ఈ నెల 25న పెద్దమనుషుల సమక్షంలో మరో కాగితాన్ని నేనే ముందుండి పూచీకత్తుతో కనకయ్యకు రాసి ఇస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు కనకయ్య అంగీకరించారు. 209 సర్వేలో వాళ్లకు సంబంధించిన భూమిని పట్టా చేసుకున్నారని కనకయ్య ఆరోపిస్తున్నారు. వారి భూమిని కొన్న, అమ్మిన దాఖలాలు లేవు. 209 సర్వే నంబర్లో ని మా అన్నదమ్ములకు సంబంధించిన భూమి మా అన్నలకు చెందింది.ఆ భూమి నాపేరు పై వస్తుంది.ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి...రికార్డుల్లో నాపేరు తొలగించాలని కోరాం అంతే. వాళ్ళ భూమికి మాకు ఎలాంటి సంబంధం లేదు.

- సర్పంచ్ మాడురీ శ్రీనివాస్

మల్లయోధుల పోరాటానికి సంఘీభావంగా కొవ్వొత్తుల ప్రదర్శన



నవతెలంగాణ-సంగారెడ్డి

సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మల్లయోధుల పోరాటానికి సంఘీభావంగా కొవ్వొత్తులతో గురువారం రాత్రి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మాణిక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యాదవ రెడ్డి మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా ఢిల్లీలోని జంతర్మంతర్ దగ్గర మహిళా రెజ్లర్లు పై లైంగిక వేధింపుల కు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ ను అరెస్టు చేయాలని, పోరాడుతున్న వారిపై ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడడం మానుకోవాలని హితవు పలికారు. బిజెపి ఎంపీ బ్రిడ్జిభూషణ్ మహిళా రెజ్లర్ల పైన అనేకసార్లు లైంగిక దాడులకు పాల్పడ్డారని, తిరగబడిన రెజ్లర్లపై కక్ష సాధింపు చర్యలకు ,అనైతిక చర్యలకు పాల్పడుతున్నాడని అని అన్నారు. ఆయనను ప్రభుత్వం ఎందుకు ఎంపీ నుండి వెనక్కి తీసుకొదని, ప్రశ్నించారు. అధ్యక్షుడు గా పదవి నుండి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లు నాలుగు నెలలుగా పోరాటం చేస్తుంటే బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి ఏమాత్రం స్పందించకపోవడం మహిళలపై ప్రధాని ఉన్న అభిప్రాయాలు బయటపడ్డాయి అన్నారు .భేటీ బచావో బేటి పడావో నినాదం ఇచ్చిన మోడీ మహిళా రెజ్లర్ల గురించి వారికి న్యాయం చేయాలనే ఆలోచన రావడం లేదని దెప్పి పొడిచారు. తక్షణమే బ్రిడ్జిభూషణ్ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రెజ్లర్లకు న్యాయం చేయాలని పోరాడుతున్న రెగ్యులర్లకు సిఐటియు, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి . ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అశోక్, నగేష్, రాజిరెడ్డి మైపాల్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ కృషితో పల్లెల్లో ప్రగతి పథం

గడ్డపోతారంలో రూ.2.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ జిన్నారం



సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పల్లె ప్రగతి పథంలో పయనిస్తూ ప్రగతికి నిదర్శనంగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామంతో పాటు దాచారం, కిష్టాయిపల్లి, అల్లినగర్ లలో 2 కోట్ల 15 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి దాయకమైన ప్రణాళికలు రూపొందిస్తూ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు వివిధ పరిశ్రమల సహకారంతో సిఎస్ఆర్ నిధులను కేటాయిస్తూ గ్రామాలను అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగు రేఖలను నింపుతున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గం మొత్తంలో సమగ్రమైన అభివృద్ధి అధ్యయంగా అనేక సంక్షేమ శ్రేయోదాయకమైన కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రతిష్టాత్మక మైన అనేక సంక్షేమ కార్యక్రమాలు నేడు యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయంటూ ప్రజలు నేడు గడపగడపకు చర్చించుకుంటూ ఉండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమాల్లో సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, గ్రామ సర్పంచ్ ప్రకాష్ చారీ, ఉప సర్పంచ్ మమతా పెంటేష్, ఎంపీటీసీ జానా బాయ్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నేత వెంకటేష్ గౌడ్, గడ్డపో తారం పాలకవర్గం సభ్యులు, మాజీ సర్పంచ్ లు అశోక్, శ్రీనివాస్, పలువురు స్థానిక నాయకులు కుమార్, నర్సింగ్ రావు, ఓంకార్, బాసెట్టి రాజు, పార్టీ మండల అధ్యక్షులు రాజేష్, జిన్నారం మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు నాయకులు పాల్గొన్నారు

దళితులకు దళిత బంధు మరిచిన సీఎం కేసీఆర్

మాలమహానాడు రాష్ట్రయువజన కార్యదర్శి ఎన్.స్వామి

నవ తెలంగాణ- గజ్వేల్



గజ్వేల్లో దళితుల భూములు రైల్వే స్టేషన్ నిర్మాణానికి తీసుకున్నారని, భూమిపోయిన దళిత రైతులందరికీ దళిత బంధు ఇవ్వాలని మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నిరుడు స్వామి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత నియోజకవర్గంలో గజ్వేల్ నుంచి పోటీ చేసి రెండుసార్లు గెలిచారని, గజ్వేల్ దళితులను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటివరకు దళితులకు ఏం చేసింది లేదన్నారు. దళితులకు ఇచ్చిన హామీలన్నీ ఇంకా నెరవేర్చలేదన్నారు. ఒక్కరు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదన్నారు. దళిత వార్డులకు వచ్చి చూడాలన్నారు. ప్రభుత్వం రైల్వే కోసం తీసుకున్న భూములకు రూ.11 లక్షలు ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు రెండు కోట్లు ఎకరం ధర పలుకుతోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికైనా గజ్వేల్ దళితులపై ప్రత్యేక దృష్టి పెట్టి దళిత బంధువు అమలు చేయాలని కోరారు. దళితులు పట్టించుకోకపోతే గజ్వేల్ లో వచ్చే ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ కి దళితులంతా ఏకంగా వ్యతిరేకంగా ఓటు వేస్తామన్నారు.

దొంగను పట్టించిన వ్యక్తికి హెచ్ఐవీ ఉందని వదిలేసిన పోలీసులు

నవతెలంగాణ కౌడిపల్లి



మార్కెట్లో రెడ్ అండ్ గా దొరికిన దొంగని హెచ్ఐవి ఉందని తెలపడంతో వదిలేసిన ఘటన కౌడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గురువారం మండల కేంద్రంలోని కౌడిపల్లి సంత లో గత కొన్ని సంవత్సరాల నుండి దాదాపు సంత రోజు ఐదు నుంచి పది ఫోన్లు పోగొట్టుకొని బాధితులు ఎంతోమంది ఉన్నారు. ఎన్ని దరఖాస్తులు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నాం అని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. గురువారం సంతలో పోలీసులు చేసే డ్యూటీని కొంతమంది యువకులు మార్కెట్లో తిరుగుతూ ఎవరు దొంగతనాలు చేస్తున్నారని గమనిస్తున్నారు. మహమ్మద్ నగర్ గ్రామానికి చెందిన యాద గౌడ్ ఆయన కూరగాయలు తీసుకుంటున్న సమయంలో జేబిలో చెయ్యి పెట్టి ఫోను తీస్తున్న యువకుడ్ని పట్టుకొని పోలీస్ స్టేషన్లో అప్పగించారు. విచారణలో దొంగ సికింద్రాబాద్ చెందిన అఖిల్‌గా గుర్తించారు. వారి బంధువులకు ఫోన్ ద్వారా తెలుపగా ఆయనకు హెచ్ఐవి ఉందని తెలపడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వదిలేసామని ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. దొంగిలించిన ఫోనును పోలీస్ స్టేషన్లో అప్పగించి దొంగను వదిలేశారు. కనీసం ఆ యువకుడికి హెచ్ఐవి ఉందా లేదా అని పరీక్షలు చేస్తే తెలిసేదని పలువురు గ్రామస్తులు పేర్కొంటున్నారు. పోలీసుల నిర్లక్ష్యంతో గ్రామాలలో మార్కెట్లలో దొంగతనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇద్దరు బీహార్‌కు చెందిన యువకులు సంతలో ఫోన్లు దొంగలిస్తుండగా పట్టుకొని పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం ఏఎస్ఐ శ్రీనివాసులు వివరణ కోరగా అఖిల్ అనే యువకుడు సికింద్రాబాద్ ప్లాట్ ఫారం మీద వాళ్ళ అమ్మతో కొట్లాడి వచ్చాడని తనకు హెచ్ఐవి ఉందని తెలపడంతో వదిలేశామని తెలిపారు

పుస్తె మట్టెల పంపిణీ

నవతెలంగాణ-సిద్దిపేట



వాసవి వనిత క్లబ్ పిఆర్ఓ మంకాల సుప్రియ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో రాణి వివాహానికి పుస్తె మట్టెలు, చీర,గాజులు అందజేసినట్లు వాసవి క్లబ్ డిస్ట్రిక్ ఇన్చార్జి మాంకాళ నవీన్ కుమార్, వాసవి వనిత క్లబ్ మాజీ అధ్యక్షురాలు మాంకాళ నాగరాణిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు చింత రాజేంద్ర ప్రసాద్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తొడుపునూరి కృష్ణవేణి, వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు అరవపల్లి హరికిరణ్, కార్యదర్శి చకిలం రవి, కోశాధికారి తిమిశెట్టి విజయలక్ష్మి, పీఆర్వో అయిత శంకర్, మాంకాళ సంతోష్, గ్రీటింగ్ చైర్మన్ మర్యాల వీరేశం, మంకాల నవీన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ఎగ్జామినేషన్‌కు సర్వం సిద్ధం

పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్



సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ శివారు ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద టిఎస్పిఆర్సి సిబిఆర్టి డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ఎగ్జామినేషన్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు పోలీస్ కమిషనర్ శ్వేత గురువారం తెలిపారు. పరీక్ష నిర్వహించే సమయంలో సెంటర్ వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు. ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల, మరియు మధ్యాహ్నం 2: 30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష వద్ద నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని, మరియు పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. త్రీ టౌన్ సిఐ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏర్పాట్లను అధికారులు సిబ్బంది దగ్గరుండి పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు.

తూర్పు నిర్మలా జగ్గారెడ్డికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-సదాశివపేట

సంగారెడ్డి ఎమ్మెల్యే జయప్రకాశ్ రెడ్డి సతీమణి నిర్మలా జగ్గారెడ్డికి మళ్లీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమించడంపై సదాశివపేట యువజన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దిడిగె నాగేష్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం సంగారెడ్డిలోని ఆమె నివాసలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలదండలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చాయని రానున్నది కాంగ్రెస్ రాజ్యమని పార్టీ బలోపేతం కోసం కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో. బ్లాక్ కాంగ్రెస్ కడల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ రాయపాటి రమేష్. తుకారం. కళ్యాణ్ రాజు. రాఘవేందర్, పట్టణ మహిళ కాంగ్రెస్ నాయకురాలు ఆకుల శోభ. లక్ష్మీ. స్వరూప. తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు



నవతెలంగాణ జహీరాబాద్

మంత్రి హరీష్‌రావుకు కలిసిన జహీరాబాద్ నియోజకవర్గ ముఖ్య నాయకులు. గురువారం జహీరాబాద్ శాసనసభ్యులు కోనింటి మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివ కుమార్, నియోజికవర్గం లోని పార్టీ ముఖ్య నాయకులతో కలిసి గురువారం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావును హైదరాబాద్లో వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అమెరికా నుండి తిరిగి వచ్చిన మంత్రి హరీష్ రావుకు శుభాకాంక్షలు తెలిపినట్లు ఎమ్మెల్యే బృందం తెలిపారు. సిడిసి చైర్మన్ ఉమాకంత్ పాటిల్, ఆత్మ కమిటీ చైర్మన్ పెంట రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్పా, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, న్యాల్కల్ జడ్పీటిసి భాస్కర్, కేతకీ ఆలయ చైర్మన్ నీల వెంకటేశం, న్యాల్కల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్, జహీరాబాద్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ మోహివుద్దిన్, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డీ, సుభాష్ రెడ్డీ, డాక్టర్. చంద్రశేకర్, రాజ్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

కోతుల బెడద నివారణకు ఎమ్మెల్యే సొంత నిధులు



నవతెలంగాణ-అమీన్ పూర్

అమీన్‌పూర్ మండల పరిధిలోని జానకంపేట గ్రామంలో కోతుల బెడదను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన బృందానికి 3 లక్షల 90 వేల రూపాయల సొంత నిధులను బుధవారం గ్రామపంచాయతీ సర్పంచ్ పాండు యాదవ్ కు ఎమ్మెల్యే జీఎంఆర్ అందజేశారు. గత సంవత్సరం కాలంగా గ్రామంలో కోతుల మూలంగా ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామపంచాయతీ పాలకవర్గం ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తీసుకొని వచ్చారు. శ్రీశైలం ప్రాంతం నుండి ప్రత్యేకంగా కోతులను పట్టుకునే బృందాన్ని నియమించి, వందలాది కోతులను బంధించి శ్రీశైలం అడవుల్లో వదిలిపెట్టారు. గ్రామంలో కోతుల సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందించిన ఎమ్మెల్యే జీఎంఆర్ టు గ్రామపంచాయతీ సర్పంచ్ పాండు యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదవశాత్తు సెక్యూరిటీ గార్డ్ మృతి

నవతెలంగాణ జహీరాబాద్

జహీరాబాద్ మండలంలోని మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమ యార్డు నందు సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహిస్తున్న ఆవుల నాగరాజు(45) గురువారం ఉదయం అనుమానాస్పదంగా మృతి చెందాడని చిరాకుపల్లి ఎస్సై కాశీనాథ్ తెలిపారు. వారం రోజుల క్రితం మహేంద్ర పరిశ్రమ వాహనాలు నిలుపేయార్డులో నాగరాజు సెక్యూరిటీ గార్డుగా విధుల్లో చేరాడన్నారు. రోజు మాదిరిగా బుధవారం రాత్రి విధుల్లోకి వచ్చాడన్నారు. ఉదయం చూసేసరికి ఒక మూలన అనుమానాస్పదంగా మృతదేహం లభించిందన్నారు. మృతుని భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారని తెలిపారు. శవాన్ని పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులు అప్పగించినట్లు తెలిపారు.

ఉపాధి హామీ కూలీలపై అడవి పంది దాడి

- ఇద్దరికీ తీవ్ర గాయాలు




నవతెలంగాణ ఝరాసంగం

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న ఉపాధి కూలీలపై అడవి పంది దాడి చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బర్దిపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులకు దాదాపు 100 మంది ప్రతిరోజు కూలీ పనికి వెళ్తున్నారు. గురువారం కుప్పనగర్, బర్దిపూర్ గ్రామ శివారులో పనులను చేపడుతుండగా పొదల్లో నుంచి అడవి పంది ఒక్కసారిగా కూలీలపై దాడి చేసింది. ఈ ఘటనలో ఎర్రోళ్ల నర్సింలు, బేగరీ రుక్కమ్మ కు తీవ్ర గాయాలయ్యాయి. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్టు లేకపోవడంతో మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.


ఓబీసీ మోర్చా సమ్మేళనానికి తరలిన నాయకులు



నవతెలంగాణ-సంగారెడ్డి

హైదరాబాదులో నిర్వహించిన ఓబీసీ మోర్చా సమ్మేళనంలో సంగారెడ్డి భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు ప్రసాది రవిశంకర్, పట్టణ ఓ బి సి మోర్చ అధ్యక్షులు పిడి సందీప్ ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా సమ్మేళనానికి సంగారెడ్డి నుంచి బయలు దేరిన భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ బి సి లకు న్యాయం జరగాలంటే బిజెపితోనే సాధ్యమవుతాదని అన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ శంకర్, వినోద్ కుమార్, సాయికిరణ్,శ్రీకాంత్, సాయిచంద్, శ్రీకాంత్, లింగమూర్తి,తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆర్థిక మంత్రిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వైద్య శాఖ మంత్రిని కలిసిన న్యాల్కల్ జడ్పీటీసీ స్వప్నభాస్కర్ గౌరవనీయులు రాష్ట్ర ఆర్థిక మరియు వైద్యా, ఆరోగ్యశాఖ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు ను వివిధ పనుల నిమిత్తం విదేశీ ప్రయాణం ముగించుకొని తిరిగి వచ్చిన శుభసందర్భంగా హైదరాబాద్లోని తన నివాసంలో ఎమ్మెల్యే కె. మాణిక్ రావుతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. న్యాల్ కల్ జడ్పీటీసీ స్వప్నభాస్కర్ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్,ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, న్యాల్ కల్ మండల పార్టీ అధ్యక్షులు రవీందర్, బిఆర్ఎస్ నాయకులు రాజు కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ లలో ప్రవేశాలకు 2023-24 సంవత్సరానికి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంగారెడ్డి ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ కె. రాజేశ్వరరావు గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్ఎస్సి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జూన్ 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఎంపికకు అవకాశముందని తెలిపారు. దరఖాస్తుల కోసం https://iti.telangana.gov.in వెబ్సైట్లో చూడాలని ప్రిన్సిపల్ సూచించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చెత్తఆటో కార్మికులపై మున్సిపల్ అధికారుల వేధింపులు ఆపాలి

- చెత్త ఆటో డ్రైవర్లకు రక్షణ కల్పించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

పొట్ట కోసం ఆటో నడుపుతూ బతుకుతున్న ఆటో డ్రైవర్లపై వేధింపులకు పాల్పడుతున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో చెత్త ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో అనేక సంవత్సరాల నుంచి చెత్త ఆటో నడుపుతున్న డ్రైవర్లపై మున్సిపల్ అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని, వారికి రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఉదయం లేవగానే సంగారెడ్డి పట్టణంలో అనేక వార్డులలో ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. అదే సమయంలో పెరిగిన ధరలకు అనుగుణంగా చెత్త ఆటో డ్రైవర్లకు ఇంటికి వంద రూపాయలు పెంచాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు 50, 60 రూపాయలు సరిపోక అనేక ఇబ్బంది పడుతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వ ఆదుకోవాలని అన్నారు. ఇంటింటికి తిరిగి ఉదయం నుంచి సేకరిస్తూ 60 రూపాయలు సరిపోక అనేక ఇబ్బందులు పడుతూ జీవనోపాధి కోసం చెత్త తీస్తున్నారు. ఆటో మెంటేనెన్స్ కూడా డబ్బులు సరిపోవటం లేదని అన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త ఆటో కార్మికులకు ఇంటికి వంద రూపాయలు పెంచాలని అలాగే వారికి రక్షణ కల్పించాలని అన్నారు. డ్రైవర్ల పై వేధింపులు



ఆపాలని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో చెత్త ఆటో యూనియన్ నాయకులు దుర్గయ్య, లక్ష్మన్ మధు, రాములు, మధు, జంగయ్య, వీరేశం, బాలరాజు, నర్సింలు పాల్గొన్నారు.

మహిళా రేజ్లర్లను వేధించిన బీజేపీ ఎంపీని వెంటనే అరెస్టు చేయాలి

- ప్రధాని నరేంద్ర మోడీ నోరు విప్పాలి
- పార్లే ఆగ్రో యూనియన్ అధ్యక్షులు,
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజయ్య



నవ తెలంగాణ - పటాన్‌చెరు

రెజ్లర్లను వేధించిన బీజేపీ ఎంపీని వెంటనే అరెస్టు చేయాలని పార్లే ఆగ్రో యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.రాజయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పాశమైలారంలోని పార్లే ఆగ్రో పరిశ్రమ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ నెలరోజుల నుండి ఢిల్లీలో రోడ్డమీద రేజర్లు ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు.బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ ను వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే పతకాలు సాధించిన మహిళలు బాధలు చెప్తే కూడా ప్రభుత్వము స్పందించకపోవడం విచారకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారని, దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి తక్షణమే జోక్యం చేసుకొని మహిళ రేజర్ల ను లైంగికంగా వేధించిన ఎంపీని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంతోష్ గౌడ్ ,రాజశేఖర్, జంగయ్య, కిరణ్, సుధాకర్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- ఉల్లాసంగా ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు
- పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

నవ తెలంగాణ - పటాన్ చెరు

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను ఏర్పాటు చేసిందని, మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలో మరింతగా రాణించాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. పట్టణంలోని మైత్రి మైదానంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతు విద్యార్థి దశనుండే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడా రంగానికి పెద్ద పీట వేయడంతో పాటు, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలో పాల్గొనేలా శిక్షణ అందిస్తున్నారని తెలిపారు.జిల్లాస్థాయి పోటీలో పాల్గొనే క్రీడాకారులకు సొంత నిధులతో ట్రాక్స్ అందిస్తామని హామీ ఇచ్చారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు ముగిస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2వ తేదీ నుండి



దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనుందని తెలిపారు. మూడు వారాలపాటు నిర్వహించే ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ ఎంపీపీ దేవానందం, జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, గుమ్మడిదల జెడ్పిటిసి కుమార్ గౌడ్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, అమీన్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

22న సంగారెడ్డి పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-సంగారెడ్డి

బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నెల 22న సంగారెడ్డి పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం సంగారెడ్డి పట్టణంలోని చింత ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ ముఖ్య నేతలు, కౌన్సిలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ చివరి ఆత్మీయ సమ్మేళనం కావడంతో భారీ ఎత్తున ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కార్యకర్తలకు దశనిర్దేశం ఇచ్చారు. 8 వేల మంది గులాబీ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు హాజరవుతారని, ఇలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించడానికి సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ చైర్మెన్ విజేందర్ రెడ్డి ,పట్టణ అధ్యక్షులు ,ఆర్ వెంకటేశ్వర్లు పట్టణ కార్యదర్శి



నర్సింలు , డాక్టర్ శ్రీహరి, ప్రభూ గౌడ్, చక్రపాణి, విష్ణువర్ధన్, అజీమ్, శ్రీకాంత్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం

నవ తెలంగాణ - అమీన్ పూర్

పఠాన్‌చెరు నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణానికి ఎమ్మెల్యే జీఎంఆర్ విరాళాల పరంపర కొనసాగుతూనే ఉంది. అమీన్ పూర్ మండల పరిధిలోని పటేల్ గూడ హరివిల్లు కాలనీలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయం, బి ఎస్ ఆర్ కాలనీలో నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయాల నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున 10 లక్షల రూపాయల విరాళాన్ని అందించారు. గురువారం పటేల్ గూడ లోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ఎమ్మెల్యే జీఎంఆర్ కాలనీవాసులకు డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్ చెరు నియోజకవర్గంలో పరమత సహనానికి పెద్దపీట వేస్తూ.. అన్ని



మతాల ప్రార్థన స్థలాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవలని కోరారు. దేవాలయాల నిర్మాణానికి విరాళం అందించడం పట్ల కాలనీవాసులు ఎమ్మెల్యే జీఎంఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, సర్పంచులు నీతీషా శ్రీకాంత్, భాస్కర్ గౌడ్, కృష్ణ, పాండు, సీనియర్ నాయకులు రాజు, మల్లేష్, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్ రెడ్డి, గోవిందు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానలో మెరుగైన వైద్యం

నవతెలంగాణ-కౌడిపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో పల్లె దవాఖానతో మెరుగైన వైద్యం అందుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామంలో ఆయన పల్లె దవాఖానను ప్రారంభించారు. రెండో విడత కంటి వెలుగు వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షుడు రాజు, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్ శేకులు తెలిపారు మండల పరిధిలోని రాయలపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఎంపీపీ రాజు సర్పంచ్ శేకులు యాదవ్ టిఆర్ఎస్ అధ్యక్షుడు సారా రామ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ వైద్య శిబిరానికి వచ్చి నేత్ర పరీక్షలు నిర్వహించుకోవాలని




అదేవిధంగా కంటి అద్దాలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు వార్డు మెంబర్లు ఆశ వర్కర్లు కంటి వెలుగు వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి కవిత అమర్ సింగ్ గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ సంజీవులు ఎంపీటీసీ స్వప్న కిషోర్ గౌడ్ డాక్టర్ శ్రీకాంత్ సృజన పల్లె దవఖాన ఎం ఎల్ హెచ్ ఓ దేవకృప మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు శంకర్ ఆశ వర్కర్లు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలపై వేధింపులు ఆపాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్

నవతెలంగాణ-జహీరాబాద్

వీవోఏలపై అధికారుల వేధింపులను ఆపి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్ డిమాండ్ చేశారు. సమ్మె ప్రారంభించి 32 రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆర్డీవో రమేష్ బాబుకు మెమొరండాన్ని అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మహిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం వీవోఏల సమ్మెను పరిష్కరించకుండా అధికారులతో బెదిరింపులు, వేధింపులు చేయించడం సరైందికాదన్నారు.



తక్షణమే సమ్మె నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివో ఏలపట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడటం తగదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే సమ్మె నివారణకు చర్యలు తీసుకొని పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల వివో ఏ లనాయకులు ముస్తఫా, అశోక్, షబ్బీర్, తదితరులు ఉన్నారు.

బస్వాపూర్‌లో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ పుల్కల్

పుల్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో గురువారం సర్పంచ్ బేకరీ సంగమ్మ విష్ణయ్య కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు ఈ కంటి వెలుగు శిబిరంలో అన్ని రకాల టెస్టులు నిర్వహించి అవసరం ఉన్నవారికి కంటి అద్దాలు మరియు మందులను ఉచితంగా అందజేస్తున్నారన్నారు కంటి



చూపు లోపంతో ఏ ఒక్కరు బాధ పడవద్దు అనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించింది అన్నారు కావున దీనిని గ్రామంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వైద్య సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్షిప్‌కు అందోల్ విద్యార్థి ఎంపిక

- హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు

నవతెలంగాణ-జోగిపేట

2వ జాతీయ ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్షిప్- 2023 క్రీడలకు అందోల్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వర్కల అఖిలేష్ ఎన్నికయ్యారు. జాతీయ క్రీడలు అరుణాచల్ ప్రదేశ్ లోని ఈటా నగర్ లో ఈనెల 19 నుంచి 21 తేదీ వరకు జరగనున్నాయి. రాష్ట్రస్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థి ప్రస్తుతం తిరుపతిలోని శ్రీ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. స్కూల్ కోచ్ రజిని కుమార్ నేతృత్వంలో క్రీడల్లో పాల్గొనడానికి వెళ్ళనున్నారు. జాతీయస్థాయి క్రీడల్లో ఎదిగేందుకు ప్రోత్సాహం అందించిన శ్రీ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎం. మోహన్ బాబు,



సీఈవో ఎం. విష్ణు బాబు, ప్రిన్సిపాల్ రాజేష్ పాటిల్, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, కోచ్ రజిని కుమార్, ఆంధ్ర ప్రదేశ్ కర్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై. వెంకటేశ్వరమ్మ, సెక్రటరీ వై. మోహన్, సురేందర్ రెడ్డి లకు విద్యార్థి వర్కల అఖిలేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. అందోల్ మండలం నుంచి జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల విద్యార్థి తండ్రి , జోగిపేట చేనేత సంఘ అధ్యక్షులు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు వర్కల అశోక్, మండల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

22న కలెక్టరేట్ వద్ద ధర్నా

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి

నవతెలంగాణ-సంగారెడ్డి



కేజీబీవీ, యూఆర్ఎస్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి పిలుపునిచ్చారు. గురువారం సన్నాహక సమావేశం శ్రీ తేజ జూనియర్ కళాశాల సంగారెడ్డిలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వై.జ్ఞానమంజరి మాట్లాడుతూ జిల్లాలో 17 కేజీబీవీలు, యూఆర్ఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ ఈ నెల 22న జిల్లా కలెక్టరేట్ సంగారెడ్డి వద్ద నిర్వహించబోయే ధర్నాకు తప్పకుండా హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు, జిల్లా కోశాధికారి పి. శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు విశాలాక్షి నాయకులు కృష్ణ, జయబునిషా, అలియా పాల్గొన్నారు.

విజేతలకు ఎమ్మెల్యే జీఎంఆర్ బహుమతుల అందజేత



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలంలోని గిరిజన గురుకుల పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడలకు సంబంధించిన విజేతలకు పటాన్చెరువు నియోజకవర్గం శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గురువారం బహుమతులను అందజేశారు. క్రీడలను విజయవంతం చేసినందుకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి క్రీడాకారులను,అధికారులను, పి ఈ టిలను, ప్రజా ప్రతినిధులను నాయకులను అభినందించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా విన్నర్స్ రన్నర్స్ గా నిలిచిన తాము బహుమతులను అందుకోవడం సంతోషంగా ఉందంటూ పలువురు జిన్నారం మండల క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ వెంట సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, టిఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్,పోతారం సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి తో పాటు జిన్నారం మండలానికి సంబంధించిన వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీల వార్డు మెంబర్లు, నాయకులు, జిన్నారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాములు తో పాటుగా పలువురు అధికార బృందం తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలపై అధికారుల ఒత్తిడి సరికాదు

- సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్

నవతెలంగాణ జోగిపేట



వీఓఏలపై అధికారుల ఒత్తిడి సరికాదని, సమస్యలు పరిష్కారం దిశగా చొరవ చూపాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె గురువారం 32 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని 18608 మంది వీ ఓ ఏ ల కుటుంబాలలో వెలుగు నింపాలని, స్వయం సహాయక సంఘాల సభ్యుల కు వీ ఎల్ ఆర్, అభయహస్తం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు "ఆశా" యూనియన్ జిల్లా కార్యదర్శి వై. యశోద బృందం తమ సంపూర్ణ మద్దతు ప్రకటించి దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీ ఓ ఏ ల జిల్లా కోశాధికారి మల్లన్న, జిల్లా నాయకులు ఆంజనేయులు, విజయ వీ ఓ ఏ లు స్వప్న సునీత సువర్ణ లక్ష్మి కవిత అనిత రేణుక లక్ష్మణ్ అబ్దుల్ ఫహీం లాయక్ అలీ, అర్ష, గోపాల్ యం.అశోక్ వీరమని, సంజీవ్, చంద్రిక పోచయ్య పాల్గొన్నారు.

తూర్పు నిర్మలా జయప్రకాశ్‌రెడ్డికి ఘన సన్మానం

నవతెలంగాణ-సంగారెడ్డి



తూర్పు నిర్మలా జయ ప్రకాశ్ రెడ్డికి రెండోసారి సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షురాలుగా తిరిగి నియామకమైన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తోపాజి అనంతకిషన్ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మలా జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రెండోసారి తిరిగి డీసీసీ అధ్యక్షురాలుగా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి తీసుకపోవడంలో కృషి చేస్తానన్నారు. తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావడానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య దుర్గేష్, సంగారెడ్డి మండల అధ్యక్షులు సిహెచ్. బుచ్చి రాములు, పట్టణ అధ్యక్షులు జార్జ్, యువజన కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, ఆరిఫ్, వెంకట్ రాజు, యాదగిరి, కసిని రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనపర్చాలి



నవతెలంగాణ-తొగుట

మండల స్థాయిలో విజయం సాధించిన యువకులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనపర్చాలని వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఎఎంసి చైర్మన్ దోమల కొమురయ్యలు కోరారు. బుధవారం సాయంత్రం సీఎం కప్ మండల స్థాయికి క్రీడా ఉత్సవాలు స్థానిక సర్పంచ్ పాగాల కొండల్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముగింపు సందర్భంగా బహుమతుల ప్రదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అధిక ప్రాధాన్యత క్రీడలకు కేటాయించినట్లతే చదువులో ముందుండాలన్నారు. ఇలాంటి క్రీడలు ఉపయోగించుకొని యువత వారి నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా స్థాయితో పాటు రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో ఎం శ్రీధర్, ఎంపీఓ చందన, స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎం శ్యామల, పీఈటీలు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక ఎస్సై కమలాకర్ రెడ్డి, స్థానిక ఎంపీటీసీ లలితా రమేష్ తదితరులు పాల్గొన్నారు. వాలీబాల్ ఫస్ట్ ప్రైజ్ తొగుట,రెండో ప్రైజ్ కాన్గల్, కబడ్డీ ఫస్ట్ ప్రైజ్ తొగుట,రెండవ ప్రైజ్ ఎల్లారెడ్డి పేట,కోకో ఫస్ట్ ప్రైజ్ ఎల్లారెడ్డిపేట,రెండో ప్రైజ్ తొగుట వారు కైవసం చేసుకున్నారు.

ఉపాధి కూలీలకు ప్రమాద బీమా చెల్లించాలి

- బీడీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

నవ తెలంగాణ -గజ్వేల్



ఉపాధి కూలీలకు ప్రమాద బీమా రూ.5 లక్షలు చెల్లించాలని బీడీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కమిటి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద గురువారం చేస్తున్న దీక్షలో ఆయన జిల్లా ప్రదాన కార్యదర్శి బ్యాగరి వేణుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పనిముట్లు ఇవ్వక, వేతనాలు సకాలంలో కూలీలకు ఉపాధి హామీ పని పట్ల విసుగువచ్చే విధంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వం పని చూపని జాబ్ కార్డులందరికి నిరుద్యోగభృతి చెల్లించాలని మాట్లాడారు.



ఉత్తమ ఏపీఎంగా పెంటాగౌడ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మనోహరాబాద్ మండల ఏపీఎం పెంటాగౌడ్ ఉత్తమ ఏపీఎం అవార్డును అందుకున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా పెంటాగౌడ్‌ను సన్మానించారు. మనోహరాబాద్ మండలంలో ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మహిళా గ్రూపులకు ఉత్తమ సేవలను అందజేయడంతో పాటు టార్గెట్‌కు మించి మహిళా గ్రూపులకు బ్యాంకు రుణాలను చెల్లించడంలో గ్రూపు మహిళలకు అవగాహన కల్పించి రుణాలను సకాలంలో చెల్లించడంలో, గ్రూపు సభ్యులకు మంచి సూచనలు సలహాలు ఇస్తు సేవలందిస్తున్నారు. సేవలను గుర్తించి తనకు ఉత్తమ ఏపీఎంగా సన్మానించినట్టు ఆయన తెలిపారు. కాగా అధికారుల నుంచి మంచి సలహాలు సూచనలు తీసుకుని సేవలందించినందుకుగాను పెంటాగౌడ్‌ను ఉత్తమ ఏపీఎంగా ఎన్నుకున్నారు. గురువారం మెదక్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ల చేతుల మీదుగా సన్మానాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి శ్రీరామరక్ష



నవతెలంగాణ-టేక్మాల్

ప్రజల సంక్షేమాన్ని కోరి ప్రవేశపెట్టిన పథకాలే భారతీయ రాష్ట్ర సమితికి శ్రీరామరక్ష అని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. గురువారం. ముస్లాపూర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమం సీఎం కేసీఆర్ సమక్షంలోనే సాధ్యమవుతుందన్నారు. మండల ప్రజలకు తనకు అవినాభావ సంబంధం ఉందని ఆ సంబంధాన్ని ఎవరు విడగొట్టలేరన్నారు. మండల ప్రజలకు సమస్యలు వస్తే వాటిని పరిష్కరించేందుకు తాను ముందుంటానని చెప్పారు. గతంలో పాలించిన నాయకులకు ప్రజలతో సంబంధాలు లేకుండా, నాయకులతో మాత్రమే సంబంధాలు ఏర్పరచుకొని ప్రజలకు దూరమయ్యారని చెప్పారు. అవసరం ఉన్న ప్రాంతాలలో అన్ని కేంద్రాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని గుర్తు చేశారు. అంతకు ముందు బోడుమెట్పల్లి చౌరస్తా నుంచి ముస్లాపూర్ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో పాల్గొన్న అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తానే బైకు స్వయంగా నడిపారు.

ప్రీమియర్ లీగ్ కోసం ముమ్మర ఏర్పాట్లు



నవతెలంగాణ-రామాయంపేట

రామాయంపేట ప్రీమియర్ లీగ్ (ఆర్ పి ఎల్) క్రికెట్ పోటీల నిర్వహణ కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రామాయంపేట రాయల్స్ స్ట్రైకర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో ఆరు ఫ్రాంచైజీలు ఒక జట్టుకు 15 మంది ఆటగాళ్ల చొప్పున 90 మంది ప్లేయర్స్‌ను వేలంలో కొనుగోలు చేశాయి. కొనుగోలు చేసిన ఆటగాళ్లతో ప్రతిరోజు స్థానిక కళాశాల మైదానంలో ఆటగాళ్లు ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈనెల 20 నుంచి జరిగే ఈ పోటీల కోసం మైదానం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్గనైజర్లు బసన్నపల్లి మల్లేశం, ఉమా మహేష్‌లు తెలిపారు. ఈ పోటీలను జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని రామాయంపేట సిఐ చంద్రశేఖర్ రెడ్డిలు ప్రారంభిస్తారని వారన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-రేగోడు

వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్ అన్నారు. గురువారం కొత్తవన్‌పల్లి, రేగోడు గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని నేరుగా వరి కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని ఆయన సూచించారు. వరి కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్, ఏవో జావిద్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్, సర్పంచ్ నర్సింలు, ఎంపిటిసి నరసింహులు, కోఆప్షన్ మెంబర్ చోటు బాయ్, నాయకులు అల్తాఫ్, భూమిరెడ్డి, ఏతాల వినీత్, తదితరు లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-నార్సింగి

నార్సింగి మండలం వల్లూరు గ్రామంలో బుధవారం బైరి లింగా గౌడ్(50), ఇటీవల బషీరా బేగం(40) గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ మృతుల కుటుంబాలను గురువారం పరామర్శించి ఆర్థిక సహాయం అందచేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఈ సందర్భంగా వారికి ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నార్సింగి గ్రామ అధ్యక్షుడు కుమ్మరి రవీంద్ర, టీపీసిసి మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్నాల శ్రీనివాస్ రావు, మండల పార్టీ మైనారిటీ అధ్యక్షుడు ఖుర్షీద్ ఖాన్, ఎస్సీ సెల్ రవీందర్, సిద్దగౌడ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేష్, దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త దేవిరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివ కళ్యాణం



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ బ్రాహ్మణ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మాస శివరాత్రిని పురస్కరించుకొని శత రుద్రం హెూమం, శివ కళ్యాణం ఘనంగా నిర్వహించారు. లోక కళ్యాణం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో చాలా మంది భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. అనంతరం తీర్థ, ప్రసాదాలను భక్తులకు నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేశాయిపేట లింగమూర్తి, వైద్య శ్రీనివాస్, శ్రీవాండ్ల శ్రీనివాస్, శ్రీవాండ్ల కృష్ణమూర్తి, రామరావు నర్సింగ్ రావు, పటేల్ రవి, కొత్తకోట ప్రసాద్, దమ్మన్నగారి ప్రసాద్, వైద్య రాజు, ఫణి, అంకుష్, సోమన్న, కృష్ణమూర్తి, సుబ్రమణ్యం, జెన్న రవి, సురేష్ లక్ష్మణ్ రావు, హర్ష, సాంబయ్య బ్రాహ్మణ వీధి కౌన్సిలర్ చోళ మేఘమాల, రాంచరణ్, పవన్, గుండయ్య, రాములు , 100 మంది బ్రాహ్మణులు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో దేవాలయ అభివృద్ధి



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ దత్తత గ్రామం గౌతోజిగూడలోని హనుమాన్ దేవాలయాన్ని దాతల సహకారంతో అత్యంత సుందరంగా పునర్‌నిర్మాణ పనులు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ బొడ్డు వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు పంచమి రేణుకుమార్‌లు తెలిపారు. గురువారం గ్రామంలోని హనుమాన్ దేవాలయ నిర్మాణానికి గ్రామ ఎంపీటీసి చింతల శ్రీలత ఆనంద్‌ల సహకారంతో దాత త్రిపురనేని యోగి దివ్య దంపతులు రూ. 51 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధితో పాటు దేవాలయ అభివృద్ధికి పాటుపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మాజీ ఎంపీటీసి నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ నర్సింలు, వెంకటేశ్, నాయకులు ఆనంద్, మైసయ్య, నర్సింలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ



నవతెలంగాణ-చేగుంట

జీలుగును వేసుకోవడం వల్ల రసాయనిక ఎరువులు వాడకం తగ్గించుకొని రైతులు అధిక దిగుబడి పొందవచ్చని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ పేర్కొన్నారు. చేగుంట పట్టణ కేంద్రం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై వచ్చిన జీలుగ విత్తనాలు గురువారం రైతులకు స్థానిక వ్యవసాయ అధికారి హరి ప్రసాద్‌తో కలిసి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు 60 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిచడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీలుగ వేసుకోవడం వల్ల రసాయనిక ఎరువుల వాడకం, ఖర్చు తగ్గించుకొని అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. స్థానిక సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జీలుగ విత్తనాలు వాడడం వలన నేల సారవంతం అవుతుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్ మాట్లాడుతూ జీలుగ విత్తనాలు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.5216 ల సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 30 కేజీల బస్తా ధర రూ, 843 ఈ బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ వెంకటలక్ష్మి , రైతు బంధు కోఆర్డినేటర్ దశరథ, ఏ ఈ ఓ లు శోభారాణి, మాధవి, ప్రవీణ్, ఆగ్రోస్ నిర్వాహకులు రాజు, శ్రీకాంత్, శాదుల్ల, రైతులు మోహన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నాగోల్‌కు బయలుదేరి వెళ్లిన బీజేపీ శ్రేణులు



నవతెలంగాణ-నర్సాపూర్

నాగోల్‌లో జరిగే ఓ బి సి మోర్చా ఆత్మీయ సమ్మేళనానికి గురువారం మెదక్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ నుంచి బిజెపి నాయకులు భారీగా బయలుదేరి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దా స్ మల్లేష్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్, రమేష్ యాదవ్ ,రాజేందర్, అశోక్, ఆంజనేయులు గౌడ్, తదితరులు అన్నారు.

కంటి చూపు పట్ల అశ్రద్ధ చేయకూడదు

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-నర్సాపూర్

కంటి చూపు పట్ల ప్రతి ఒక్కరూ అశ్రద్ధ చేయకూడదని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం నర్సాపూర్ మండల పరిధిలోని చిన్న చింతకుంట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 79 రోజుల నుంచి నిర్వహిస్తున్న రెండవ విడత కంటి వెలుగు శిబిరాలకు ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తున్నదని అన్నారు. ఇదే స్ఫూర్తితో జూన్ 15 వరకు కొనసాగే కంటి వెలుగు శిబిరాలను అత్యంత మెరుగ్గా, పారదర్శకంగా నిర్వహిస్తూ గ్రామాలలో 18 ఏళ్ళు పైబడిన అందరు కంటి పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కంటి వెలుగు కార్యక్రమం మన ఇంటికి వెలుగులాంటిదన్నారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి వెలుగు శిబిరాల పట్ల ప్రజలకు అవగాహన ఉండడంవల్ల స్వచ్ఛందంగా శిబిరాలకు తరలివస్తు నేత్ర పరీక్షలు చేసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్న తీరును, రికార్డులను, కంటి అద్దాలు, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ రీడింగ్ అద్దాలు స్టాక్‌లో ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 415 జీపిలు, 73 వార్డులలో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించి 4,17,365 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 44,308 మందికి రీడింగ్ అద్దాలు, 34,093 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు అందజేశామని, మరో 11,707 మందికి త్వరలో అందజేయనున్నామని అన్నారు. కాగా ఇప్పటి వరకు నేత్ర పరీక్షలుచేసుకున్నవారిలో 3,27,240 మందికి ఎటువంటి సమస్యలు లేవని నిర్ధారించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అనంతరం వైకుంఠ ధామాన్ని పరిశీలించి బోర్ పంపు సెట్‌ను వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించి వాడుకలోకి తేవాలని సూచించారు. డంప్ యార్డ్ ను పరిశీలించి తడి, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు పొడిచెత్తను ఎరువుగా విక్రయించి గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యమే పరమావధిగా వర్షాకాలానికి ముందే గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టుటకు ప్రభుత్వం ఈ నెల 17 నుండి వారం రోజుల చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా సైడ్ డ్రైన్స్ క్లినింగ్ పనులను పరిశీలించారు. ఆ తరువాత నర్సరీని పరిశీలించి అవెన్యూ ప్లాంటేషన్ కు టేకోమా, కానుగ వంటి పెద్ద మొక్కలు లేకపోవడాన్ని గమనించి పక్క నర్సరీల నుంచి అనువైన మొక్కలు సేకరించి తరలించుటకు సిద్ధంగా ఉంచాలన్నారు. పెద్ద చింతకుంట గ్రామ సమీపంలోని మహాలక్ష్మి రైస్ మిల్ ను సందర్శించి పెండింగ్ లో ఉన్న సి.యం .ఆర్. రైస్ ను రోజు 170 మెట్రిక్ టన్నుల చొప్పున ఈ నెలాఖరు వరకు ఎఫ్.సి.ఐ. కి తరలించాలని యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. చందు నాయక్, డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, డిపిఓ సాయిబాబ, పంచాయత్ రాజ్ ఈ ఈ సత్యనారాయణ రెడ్డి, డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ విజయనిర్మల, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, తహశీల్దార్ ఆంజనేయులు, ఎం .పి .డి.ఓ. మార్టిన్ లూథర్, సర్పంచ్ సురేష్ గౌడ్, ఎంపీపీ వెంకట నర్సింగరావు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో డెలివరి బాయ్ లేక ప్రజల ఇబ్బందులు

- గత మూడు నెలల నుంచి బీపీఎం బాధ్యతలు
- సమయానికి నోటీసులు రాక నష్టపోతున్న ప్రజలు
- పోస్టాఫీసు వద్ద బాధితుల ఆవేదన



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మనోహరాబాద్ బ్రాంచ్ పోస్టాఫీసులో డెలివరి బాయ్‌లేక సమయానికి రావాల్సిన ఉత్తరాలు, నోటీసులు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి నోటీసులు అందక తీవ్రంగా నష్టపోతున్నట్టు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా ఉన్న అధికారి గత సంవత్సర కాలంగా ఎవరూ లేక పోయినా తానే ఇప్పటి వరకు పంపిణీ చేశానని, ఈ నెలలో ఇవ్వలేకపోయానని ఈ విషయాన్ని పై అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికి స్పందించడం లేదని తెలిపారు. ఈ సంఘటన గురువారం మనోహరాబాద్ పోస్టాఫీసులో జరిగింది. వివరాల ప్రకారం మనోహరాబాద్ పోస్టాఫీసు పరిధిలో సుమారు 8 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాగా గత సంవత్సర కాలంగా బ్రాంచ్ పోస్టాఫీసులో డెలివరి బాయ్ లేకుండా పోయాడు. దాంతో బ్రాంచ్ పోస్టుమాస్‌గా విధులు నిర్వహిస్తున్న విశ్వాస్‌రెడ్డి డెలివరి పనులను కూడా అదనంగా నిర్వహిస్తున్నారు. దాంతో అటు పోస్టాఫీసులు పనులు డెలివరి బాయ్ పనులను కూడా చూడాలంటే ఇబ్బందిగా ఉందని పై అధికారులకు పలు మార్లు సమా చారాన్ని ఇచ్చినట్లు తెలిపారు. దాంతో ప్రజలకు వచ్చే ఉత్తరాలను, కోర్టు నోటీసులు కానీ, ఇతర అన్ని రకాల నోటీసులు వందల సంఖ్యలో పేరుకు పోయాయి. అందులో భాగంగానే మండలంలోని రంగాయిపల్లి గ్రామానికి చెందిన సంతోష్ ఆర్థిక అవసరనిమిత్తం ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారాన్ని తాకట్టు పెట్టినట్టు తెలిపారు. కాగా డబ్బులు చెల్లించకపోవడంతో తనకు ఫైనాన్స్ నుంచి నోటీసులు వచ్చినట్టు తెలిపారు. కాగా పోస్టాఫీసులో డెలివరి బాయ్ లేక పోవడంతో నోటీసులు ఇవ్వకపోవడంతో బ్యాంక్ అధికారులు బంగారాన్ని వేలం వేసినట్టు తెలిపారు. తనకు సమాయానికి నోటీసులు అంది ఉంటే తాను బంగారాన్ని విడిపించుకునే వాడినని పోస్టాఫీసు అధికారులు నిర్లక్ష్యం మూలంగానే తాను పూర్తిగా నష్టపోయానని తనకు ఎవరు న్యాయం చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గత మూడు నెలల క్రితం ఆదార్ కార్డుకు కూడా అప్లై చేశానని వచ్చినట్టు మెసేజ్ వచ్చినప్పటికి ఇప్పటి వరకు ఇవ్వడం లేదన్నారు. అలాగే అబ్దుల్ ఖయ్యూం కు పాస్‌పోర్టు వచ్చినట్టు ఏప్రిల్ నెల 21న డెలివరి అయినట్టు ఫోన్ ద్వార మెసేజ్ వచ్చినట్టు తెలిపారు. కానీ ఇప్పటి వరకు పాస్‌పోర్టు ఇవ్వకపోవడంతో తాను ఇబ్బందులను ఎదుర్కోవడమే కాకుండా ఇతర దేశాల నుంచి తనకు వస్తావా లేదా అంటు ఫోన్‌లు వస్తున్నాయని, డ్యూటీకి వెళ్లలేని పరిస్థితి నెలకొందని, తనకు నష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో బ్రాంచ్ పోస్టుమాస్టర్ విశ్వాస్‌రెడ్డిని వివరణ కోరగా తాను డెలివరి పనులు చేయలేనని పై అధికారులకు సమాచారాన్ని ఇచ్చానని తెలిపారు. సంవత్సరం అవుతున్నటికి డెలివరి బాయ్ లేకపోవడంతో తాను, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డెలివరి బాయ్‌ను ఏర్పాటు చేయాలని సమాచారాన్ని ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి వెంటనే డెలివరి బాయ్‌ను ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్ద నిజాంపేట్ నుంచి చిన్న నిజాంపేటకు బీటీ రోడ్డు వేయాలి



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి మారుమూల గ్రామాలకు బీటి రోడ్లను వేసి గ్రామాల రూపురేఖలను మార్చారు. ఈ మేరకు మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామ శివారులో నుంచి చిన్న నిజాంపేట గ్రామం వరకు మట్టి రోడ్డు ఉండడంతో ప్రయాణికులు, వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా కూడవెళ్లి ప్రసిద్ధిగాంచిన శ్రీ రామలింగేశ్వర ఆలయానికి నిజాంపేట మండల చుట్టుముట్టు ప్రజలు భూంపల్లి గేటు మీదుగా వెళ్లాల్సి వస్తుంది. నిజాంపేట మండల కేంద్రం నుంచి చిన్న నిజాంపేటకు బీటీ రోడ్డు వేసినట్లయితే దూరం తగ్గించుకోవచ్చని , ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని నిజాంపేట మండల ప్రజలు స్పష్టం చేశారు. నిజాంపేట మండల కేంద్రం నుంచి వయా భూంపల్లి చిన్న నిజాంపేటకు చాలా దూరమవుతున్నందున 8 కిలోమీటర్లు ఎక్కువవుతున్నందున పెద్ద నిజాంపేట నుండి నేరుగా చిన్న నిజాంపేటకు బీటీ రోడ్డు వేసినట్లయితే ఎనిమిది కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఇప్పటికైనా మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు చొరవతో బీటీ రోడ్డు పనులను ప్రారంభించాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు. ఈ బిటి రోడ్డు పనుల ద్వారా సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు వెళ్లే ప్రజలకు ఎంతో మేలు చేసిన వారవుతారని ప్రజలు వాపోతున్నారు. మండలంలో చుట్టుముట్టు అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ చిన్న నిజాంపేటకు రోడ్డు సౌకర్యం లేక ద్విచక్ర వాహనదారులకు వ్యవసాయ రైతులకు ఇబ్బందులు గురవుతున్నామని వాపోతున్నారు. మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు స్పందించి రోడ్డు పనులను ప్రారంభించాలని రైతులు ప్రయాణికులు వేడుకుంటున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు



ఎన్నో సంవత్సరాల నుంచి సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చిన్న నిజాంపేటకు మెదక్ జిల్లా పెద్ద నిజాంపేటకు సరైన రోడ్డు సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నాము. ఇప్పటికీ చిన్న నిజాంపేట గ్రామంలోని రైతులందరికీ పెద్ద నిజాంపేట మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంకులో ఖాతాలు ఉన్నందున వారికి రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజల సౌకర్యార్థం ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే పెద్ద నిజాంపేట నుంచి చిన్న నిజాంపేటకు బీటీ రోడ్డు వేయాలి.

దాత్రిక మారుతి
కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

వ్యవసాయ శాఖ ఏడీఏ సురేఖ





నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

రైతులకు నకిలీ విత్తనాలు కానీ కాలం చెల్లిన విత్తనాలను కాని అమ్మితే వారిపై సీడ్ ఆక్ట్ ప్రకారం కఠిన చర్యలుంటాయని నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడీఏ సురేఖ హెచ్చరించారు. గురువారం మండలంలోని విత్తన డీలర్ దుకాణాలను, అలాగే సీడ్ ప్రాసెసింగ్ యూనిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మనోహరాబాద్ రైతులు వేదికలో సీడ్ డీలర్‌లు, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలుకానీ కాలం చెల్లిన విత్తనాలుకానీ అమ్మినట్లు తమ దృష్టికి వచ్చినా కఠిన చర్యలుంటాయని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, అలాంటి విత్తనాలనే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఏఎస్ఐ చంద్రమోహన్‌లతో పాటు సీడ్ డీలర్లు, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ల బాధ్యులు, రైతులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-టేక్మాల్

నకిలీ విత్తనాలు, కల్తీ విత్తనాలు, కల్తీ మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వారి లైసెన్సులు రద్దు చేస్తామని శంకరంపేట ఏడిఏ రాంప్రసాద్ అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారుల ఆదేశాలు మేరకు మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం రైతులు, ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డీలర్స్ వద్ద విధిగా లైసెన్సులు, స్టాక్ బోర్డులు ఉండాలని ఏడిఏ రాంప్రసాద్ సూచించారు. రిజిస్టర్లు కచ్చితంగా ఉండాలని సూచించారు. లేనియెడల వారి లైసెన్స్ రద్దు చేసి దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. రైతులు కూడా డీలర్ల వద్ద విత్తనాలు, ఫర్టిలైజర్, పురుగు మందులు తీసుకున్నప్పుడు ఖచ్చితంగా రశీదు పొందాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ దయానంద్, ప్రవీణ్, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టుకోవడానికి రూ. ఐదు లక్షలు ఇస్తాం

దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-చేగుంట

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికి ఇల్లు కట్టుకోవడానికి ఐదు లక్షల రూపాయలు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆత్మగౌరవ యాత్రలో భాగంగా గురువారం 67వ రోజున చేగుంట పట్టణ కేంద్రంలో గల్లి గల్లి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా వచ్చి తీరుతుందన్నారు. అధికారంలోకి రాగానే ఏటా రెండు లక్షల ఉద్యోగాలు నిరుద్యోగులకు ఇచ్చి తీరుతామన్నారు. ఇంట్లో ఎంతమంది వృద్దులు ఉన్నా అందరికీ పింఛన్లు అందజేస్తామన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం దొరల పాలన కొనసాగిస్తున్నారన్నారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. రాబోయే ఎలక్షన్లలో ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే గ్రామాలలో ప్రతి సోమవారం రచ్చబండ పెట్టి ప్రతి సమస్యను పరిష్కరిస్తానని చెరుకు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గణేష్ వడ్ల నవీన్, స్టాలిన్ నర్సింలు, మహిళా అధ్యక్షురాలు కుర్మలక్ష్మి, మద్దూరి రాజు, కొండి శ్రీనివాస్, అన్నం ఆంజనేయులు, కాశ బోయిన మహేష్, ఫకీర్ నాయక్, తయాప్, బాల్ రెడ్డి, అశోక్, చౌదరి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భార్యను కాపాడబోయిన భర్త మృతి



నవతెలంగాణ -పాపన్నపేట

కుటుంబ కలహాలతో బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకోబోయిన భార్యను కాపాడేందుకు బావిలోకి దిగిన భార్యతో పాటు భర్త మృతి చెందిన సంఘటన మండలంలోని నార్సింగి గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయకుమార్ కథనం ప్రకారం... ఆ గ్రామానికి చెందిన దారబోయిన నగేష్ (35), స్వరూప(32) వ్యవసాయంతో పాటు ఇటీవల గ్రామ శివారులో ఉన్న ఓ ఫామ్ హౌస్ వద్ద ఉన్న పశువుల కాపరులుగా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంత కాలంగా నగేష్ మద్యానికి బానిసగా మారాడు.దీంతో భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి.బుధవారం ఇద్దరు కలిసి పని నిమిత్తం ఫామ్ హౌస్ వద్దకు వెళ్లారు.అక్కడ మళ్లీ సంసార విషయంలో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది..దీంతో అదే ఆవేశంలో స్వరూప అక్కడే ఉన్న బావిలో దూకింది.భార్యకు కాపాడే ప్రయత్నంలో నగేష్ తన దుస్తులు, ఫోన్ ఒడ్డున పెట్టి బావిలోకి దిగాడు.నీటిలో భార్యను కాపాడే ప్రయత్నం చేశాడు.సాధ్యం కాకపోవడంతో ఊపిరి ఆడక ఇద్దరు మృతి చెందారు..రాత్రి అయినా తిరిగి రాక పోవటంతో కుటుంబ సభ్యులు చుట్టూ పక్కల వెతికారు.ఫామ్ హౌస్ వద్దకు వచ్చి వెతుకు తుండగా బావి వద్ద నగేష్ చెప్పులు, బట్టలు కనిపించాయి...రాత్రి కావడంతో ఉదయం గాలిస్తుండగా బావిలో ఇద్దరు మృత దేహాలు పైకి తేలియాడాయి.పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృత దేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నగేష్ తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు..

నూతన పంచాయతీ భవనాన్ని పరిశీలించిన ఎంపీపీ



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం సోమల తండాలో గురువారం నూతనంగా మంజూరైన గ్రామపంచాయతీ భవనాన్ని మండల ఎంపిపి మాసుల శ్రీనివాస్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తండాలను గ్రామపంచాయతీలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దేనని, అలాగే నూతన గ్రామపంచాయతీ లను మంజూరు చేసిందని తెలిపారు. గ్రామపంచాయతీ నిర్మాణం పనులు దాదాపు 80 శాతం పూర్తయిందని, మిగతా నిర్మాణం పనులు తొందరగా పూర్తి చేసి త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

సీఎం కప్ క్రీడా విజేతలకు బహుమతుల ప్రధానం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సిద్ధ రాములు ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. వాలీబాల్‌లో మొదటి బహుమతి కల్వకుంట గ్రామానికి, రెండవ బహుమతి నస్కల్, కబడ్డీలో మొదటి బహుమతి చల్మెడ, రెండవ బహుమతి కల్వకుంట సాధించాయి. ఖోఖోలో కల్వకుంట రన్నింగ్, షాట్ పుట్, లాంగ్ జంప్ విజేతలకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి సిద్ధరాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక యువకులను క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. సీఎం కప్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. మండల స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభాకర్, ఇన్చార్జ్ ఎంపిఓ వెంకట నరసింహారెడ్డి, చల్మెడ, సర్పంచు నరసింహారెడ్డి, ఎంపీటీసీలు లహరి రెడ్డి, బాల్రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాగరాజు, యూత్ అధ్యక్షులు మావురం రాజు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది విట్టల్, నర్సింలు, బిఆర్ఎస్ నాయకులు కిష్టారెడ్డి, లక్ష్మీ నర్సింలు, రంజిత్ గౌడ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తూర్పార బెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలి



నవతెలంగాణ-టేక్మాల్

రైతులు తూర్పారబెట్టిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సర్పంచ్ స్వరూపా అన్నారు. గురువారం మండల పరిధిలోని బొడ్‌మెట్‌పల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యాన్ని కోయగానే రైతులు ఆధారా బాదరాగా కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించుకొని రావద్దని హితవు పలికారు. తూర్పారబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోకి తరలిస్తే నిర్వాహకులు తూకం వేసుకొని మొదటి రకంగా గుర్తించి రైతుకు గిట్టుబాటు అయ్యేలా చూస్తారన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో, రాజు, భవాని అంజయ్య శంకర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొనదొడ్డి శ్రీనివాస్, తలారి భూపాల్ పాల్గొన్నారు.

31న బ్రాహ్మణ భవనం ప్రారంభోత్సవం



నవతెలంగాణ-నార్సింగి

గోపనపల్లిలో నూతనంగా నిర్మించిన బ్రాహ్మణ భవన్‌ను ఈ నెల 31వ తేదిన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు పుల్యాకుల శ్రీనివాస్ శర్మ కోరారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బ్రాహ్మణ భవనం ప్రారంభోత్సవం చేయనున్నారని, బ్రాహ్మణులు వేలాదిగా తరలి రావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాగరాజ్ శర్మ వినీత్ శర్మ లక్ష్మణ శర్మ, భరత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేద్దాం



నవతెలంగాణ-దుబ్బాక: వచ్చే ఎన్నికల్లో దుబ్బాక గడ్డపై గులాబీ జెండాను ఎగరవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గుండవెల్లి ఎల్లారెడ్డి కోరారు. మెదక్ ఎంపీ,బి.ఆర్.ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట 10,11 వార్డులకు సంబంధించిన 31,32వ బూత్ కమిటీ అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 31,32వ బూత్ కమిటీ అధ్యక్షులుగా కూరపాటి వెంకటేష్, ఎండి సాధిక్ అలీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. 31వ బూత్ యూత్ అధ్యక్షులుగా ఆసరి రమేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎండి షారుక్ ఖాన్, ఇస్త్రారిగల్ల అనిల్, 32వ బూత్ యూత్ అధ్యక్షులుగా బంధారపు దేవేందర్ గౌడ్, ఎండి ఫహద్, తడ్క నరేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. 10వ వార్డ్ కౌన్సిలర్ కూరపాటి బంగారయ్య, బిఆర్ఎస్ దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ గౌడ్, బిఆర్ఎస్ 10, 11 వార్డుల అధ్యక్షులు బందారపు రాంప్రసాద్ గౌడ్, ఆస రవి, సీనియర్ నాయకులు నాయకులు గన్నె భూమ్ రెడ్డి, నందాల శ్రీకాంత్, బడుగు రాజు,మంచె శ్రీనివాస్, కొండ కృష్ణ,పెంబర్తి శ్రీశైలం, షాదుల్, సలీం, స్వామి, ప్రవీణ్, వంజరి భాగ్యమ్మ సావిత్రి, పద్మ, కైసర్ పలువురున్నారు.

నవతెలంగాణ

4



సిద్దిపేట

శుక్రవారం 19 మే 2023

రూమ్ టూ రీడ్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం

నవతెలంగాణ -మిరుదొడ్డి



అక్బరుపేట భూంపల్లి మండలంలోని భూంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారని మండల కో ఆర్డినేటర్ మధుకర్ రెడ్డి తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో పిల్లల పఠనాశక్తి, సృజనాత్మక, కళాత్మకత పెంపొందించాడానికిగాను డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రీడింగ్, రోల్ ప్లే లాంటి కార్యక్రమాలను గత వారం రోజులుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ శిబిరంలో ఈ పాఠశాల పిల్లలే కాకుండా ప్రైవేట్ పాఠశాలల పిల్లలు కూడా చాలా చురుకుగా, ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నందుకు ప్రాథమిక పాఠశాల భూంపల్లి ప్రధానోపాధ్యాయులు డి. బిక్షపతి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ రూమ్ టూ రీడ్ కో - ఆర్డినేటర్ మధుకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరచిన పిల్లలకు బహుమతులను ఇవ్వడం జరిగింది.

అద్భుతంగా అభివృద్ధి చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ

- జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

అద్భుతంగా అభివృద్ధి చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో గురువారం బీఆర్ఎస్ చేర్యాల రూరల్ మండల ఆత్మీయ సమ్మేళనం పార్టీ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న తెలంగాణకు ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణకు ఉన్న తేడా మన కళ్ళ ముందు కనబడుతుందని, పంటపొలాలకు 24 గంటల కరెంటు అందుతుందని గతంలో కరెంట్ లేక పంటలు ఎండిపోయేవన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో నియోజకవర్గంలోని చెరువులు ఎండాకాలంలో కూడా నిండు కుండలా మారి సస్యశ్యామలం అయ్యాయన్నారు. గ్రామాలలో ఉన్న పాఠశాలలను మన ఊరు మన బడి కార్యక్రమం క్రింద అభివృద్ధి చేసుకుంటున్నామని, మత్స్య సంపద కూడా బాగా పెరిగిందన్నారు. 50 ఏళ్ల క్రితం చేర్యాల మున్సిపాలిటీగా ఉండేది దానిని ఆనాటి పాలకులు గ్రామపంచాయతీ చేశారన్నారు. స్వరాష్ట్రంలో సీఎం చేర్యాలను తిరిగి మున్సిపాలిటీగా మార్చారన్నారు. దేశంలో రైతులు క్షేమంగా ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, పచ్చదనంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. మండలంలో ఇప్పటి వరకు రూ.13 కోట్లు రైతు బీమా క్రింద చెల్లించామని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప-శ్రీధర్ రెడ్డి, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్ రెడ్డి, ఏఎంసి చైర్మన్, వైస్ చైర్మన్ మల్లేశం గౌడ్,పుర్మ వెంకట్ రెడ్డి, సర్పంచ్‌లు సొంటి రెక్కల బిక్షపతి, చీపురు రేఖ, పుర్మ మమత-రాంరెడ్డి, దినేష్ తివారి, ఎంపీటీసీలు మిట్టపల్లి సులోచన-శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల నర్సయ్య, యువజన సంఘం నాలుగు మండలాల ఇన్చార్జి శివ గారి అంజయ్య, సోషల్ మీడియా మండల కన్వీనర్ తాటికొండ సదానందంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ గ్రామంలో కంటి వెలుగును ప్రారంభం

నవతెలంగాణ-ములుగు



శ్రీరాంపూర్ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా ఉంచాలని ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని స్టీల్ సామాగ్రిని మాత్రమే వాడాలని దాసరి స్రవంతి కన్వేష్ అన్నారు. సీనియర్ నాయకులు గజ్వేల్ నియెజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ కొమ్ము నవీన్ కూమార్ మాట్లాడుతూ కంటి వెలుగును ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సతీష్, వార్డ్ సభ్యులు చంద్రశేఖర్, సుదర్శన్, స్వామి, బి.రాజు, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంకర్, సీనియర్ నాయకులు డి.రాములు, బాల్ నర్సయ్య రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ సర్కిల్ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోండి

నవతెలంగాణ-సిద్దిపేట

టీఎస్ ఎస్సి స్టడీ సర్కిల్లో ఐదు నెలల ఫౌండేషన్ కోర్స్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 17 నుంచి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చుని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి డాక్టర్ పి శ్రీరామ్ రెడ్డి , స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్‌లు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఈ నెల 21న స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నామని తెలిపారు. జనరల్ స్టడీస్ 55 మార్కులు, జనరల్ ఎబిలిటీ 45 , మొత్తం వంద మార్కుల ప్రశ్నాపత్రం ఉంటుందని తెలిపారు. మెరిట్ ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

పంచాయతీ రికార్డులను పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని తోర్నాల గ్రామ పంచాయతీ రికార్డులను ఎంపీడీవో శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలకు ఓసారి గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలిస్తామన్నారు. అందులో భాగంగానే గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, టిఏ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల నాయకులు తాళ్లపల్లి బిక్షపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఖాతా పాఠశాల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-నంగునూరు

అక్కెనపల్లి మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఖాతా పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. మొదటి ర్యాంక్‌తో పాటు, పది లోపు ఆరు ర్యాంకులను కైవసం చేసుకొని ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను, ఖాతా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రవీందర్ రెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ పుల్లూరు గణేష్, గ్రామ సర్పంచ్ చల్లా దశమంత రెడ్డి అభినందించారు. రాబోయే కాలంలో ఇదే విధంగా మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు.

పేద ప్రజల కంటి సమస్యలు తీర్చేందుకు కంటి వెలుగు

నవతెలంగాణ-తొగుట



పేద ప్రజల సంక్షేమం కోసం కంటి వెలుగు శిబిరం ఉపయోగపడుతుందని సర్పంచ్ కొలిచల్మ స్వామి అన్నారు. గురువారం మల్లన్నసాగర్ ముంపు గ్రామం ఆర్ అండ్ ఆర్ లక్ష్మపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాల పై బడిన వారందరు కంటి సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. మనిషికి అన్ని అవయవాల కంటే ముఖ్యమైనవి కండ్లు అన్నారు. రాష్ట్ర ప్రజల కంటి సమస్యలు పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ కంటి వెలుగు 2 శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. 18 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అద్దాలు, మందులు అవసరం ఉన్నవారికి వెంటనే అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య, అప్తో మెట్రిస్ట్ వి.లావణ్య, డాటా ఎంట్రీ ఆపరేటర్ పర్హాన, హెల్త్ సూపర్వైజర్ కేజీ శ్యామల, ఎంపీఓ చందన, పంచాయతీ కార్యదర్శి నిఖిల, ఏఎన్ఎం నీల, ఆశా కార్య కర్త భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ స్వామి, వార్డ్ సభ్యులు కనకరాజు, రాములు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండలంలోని దొమ్మాట గ్రామంలో గురువారం డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం రూ.13.60 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్వాడి కేంద్రానికి శంకుస్థాపనతోపాటు గ్రామంలో రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ, మహిళా భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. పేద ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు కొనసాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాలి పల్లి సుభాషిణి, తహసీల్దార్ ఎస్.కె ఆరిఫా, ఎంపీడీవో తారీక్ అన్వర్, ఏపీఎం బాబురావు, అర్ ఐ, రాజేందర్ రెడ్డి,వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శించిన పీఏసీఎస్ వైస్ చైర్మన్

నవతెలంగాణ-ములుగు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో త్వరితగతిన లిఫ్టింగ్ చేయాలని పిఎసిఎస్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ అన్నారు. మండలంలోని తునికి బొల్లారం గ్రామంలో ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకం వేసిన ధాన్యాన్ని త్వరితగతిన వెంటవెంటనే లిఫ్టింగ్ చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

రేబర్తిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని రేబర్తి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భం గా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల జరిగిన బొడ్రాయి పండుగ సందర్భంగా ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టి వార్డులను పరిశుభ్రం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-తొగుట: మండలంలోని కాన్గల్ గ్రామంలో ఇటీవల మరణించిన తొలి మహిళ మండల అధ్యక్షురాలు కుమ్మరి లచ్చవ్వ కుటుంబ సభ్యులను వైస్ ఎంపీపీ బాసిరెడ్డిగారి శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం అందజేశారు. ఆయన వెంట చైర్మన్ దోమల కొమురయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ముడికె కనకయ్య రైతుబంధు గ్రామ అధ్య క్షులు కాముని లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి : ఎంపీపీ గజ్జెల సాయిలు

నవతెలంగాణ -మిరుదొడ్డి



ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ గజ్జల సాయిలు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం పేద ప్రజలకు అందుతుందని తెలిపారు. మిరుదొడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారిని సమీనా సుల్తానా ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన జన ఆరోగ్య సమితి సమావేశంలో ఎంపీపీ సాయిలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. జన ఆరోగ్య సమితి సమావేశంలో ఆసుపత్రికి వస్తున్న నిధులు ప్రజలకు అందుతున్న వైద్యంపై ఎంపీపీ సాయిలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, డాక్టర్ తేజస్విని, కో ఆప్షన్ సభ్యుడు హైమద్, సర్పంచ్ రాములు, ఎంపీటీసీ నర్సింలు, సిహెచ్‌ఓ లింగమూర్తి పలువురు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- గడ అధికారి ముత్యం రెడ్డి

నవతెలంగాణ-మర్కుక్



రెండో కంచిగా పిలువబడే వరదరాజ పూర్ గ్రామంలోని వరదరాజుల స్వామి ఆలయ పనులను త్వరగా పూర్తి చేయాలని గడ అధికారి ముత్యం రెడ్డి, అర్ అండ్ బీ ఎస్సీ వసంత నాయక్ అన్నారు. గురువారం మండలంలోని వర్దరాజ్ పూర్ గ్రామంలో అత్యంత ప్రసిద్ధి కలిగిన పురాతన దేవాలయం వరదరాజ స్వామి ఆలయ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావణ మాసంలోపు పనులు పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ బాలప్రసాద్, ఏఈ శ్రీనివాస్, తదితరులున్నారు.

వడ్ల కొనుగోలు పరిశీలించిన గడ

మండలంలోని వర్థరాజ్‌పూర్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గడ అధికారి ముత్యంరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాసేపు రైతులతో మాట్లాడారు. వడ్లు పట్టే జల్లి మిషన్లు సరిపడా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ అప్పాల ప్రవీణ్ కుమార్ గడ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత అధికారుల ఫోన్ ద్వారా సమాచారం అందజేసి, మిషన్‌ను తెప్పించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-మిరుదొడ్డి



రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని సర్పంచ్ బాల్ నరసింహులు అన్నారు. మండలంలోని లింగుపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ గిట్టుబాటు ధర పొందాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేసింది లేదని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల కోసం సంక్షేమ పథకాలు తీసుకురావడంతో పాటు గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రంలో సాగునీటికి ఇబ్బందులు తొలగిపోయాయని అన్నారు. గతంలో ఏనాడు లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో అధికంగా పంటలు పండించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీవోఏ మహేష్, గ్రామ మహిళ సంఘం సభ్యులు గాలవ్వా, నర్సవ్వ,పోచవ్వ, గ్రామస్తులు యాదగిరి, బాబు ,యాదయ్య తదితరులు ఉన్నారు.

పేద క్రీడాకారినికి కెఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేయూత

నవతెలంగాణ-సిద్దిపేట



జాతీయ స్థాయి ఫుట్ బాల్ జట్టుకు ఎంపికైన పేద క్రీడాకారినికి కెఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహకారం అందించినట్లు చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మిట్టపల్లి గ్రామంలోని గురుకుల కళాశాలలో చదువుతున్న మోతె అంజలి ఇటీవల జాతీయ స్థాయి ఫుట్బాల్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. హైదరాబాద్‌లోని ఫుట్ బాల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆమెను జట్టుకు ఎంపిక చేసిన, ఉండడానికి అక్కడ సౌకర్యాలు లేకపోవడంతో విషయాన్ని తమ దృష్టికి కోచ్ అజర్ తీసుకొచ్చారని తెలిపారు. అంజలి హైదరాబాద్ లో ఉండడానికి అవసరమయ్యే మూడు నెలల ఖర్చు రూ 14100ల చెక్‌ను క్రీడాకారిణికి అందించినట్లు తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా అంజలి కె.వి.ఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండ రాజ్ కుమార్, ఎజాజ్ పటేల్, ఫౌండేషన్ సభ్యులు ఖదీర్ అలీ, మొహమ్మద్ యూసుఫ్, ఫుట్బాల్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అందుబాటులో ఉంచాలి



నవతెలంగాణ-చేర్యాల

ప్రతీ నెలా 1వ తేదిన మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ బియ్యం అందుబాటులో ఉంచాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గురువారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎస్.కె. ఆరిఫాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సరైన సమయానికి రేషన్ బియ్యం అందక ప్రజలు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. నేటికి 20 రోజులు గడిచినా రేషన్ బియ్యం ప్రజలకు అందకపోవడం వల్ల తిండి లేక అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రేషన్ షాపులకు బియ్యం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 30 వరకు పొడిగించి రేషన్ బియ్యం ఇచ్చేలా చర్యలు చేపట్టి వచ్చే నెల నుండి ప్రతి నెల 1న అన్ని రేషన్ షాపుల్లో బియ్యం, సరుకులు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మాదబోయిన మల్లయ్య, రాజు, సురేందర్, పాల్గొన్నారు.

పయనీర్ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు

నవతెలంగాణ-దౌల్తాబాద్



మండల కేంద్రంలోని రైతు వేదికలో కార్టేవా అగ్రిసైన్స్ పయనీర్ సీడ్స్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామములో నుంచి ఉత్తమ రైతులను ఎంపిక చేసి వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. సేల్స్ మేనేజర్ భీంరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో పంట వేసుకోవడానికి అనుకూలంగా ఉండే రకం పి3302 అని సూచించారు. ఈటీఎండీ పవన్ జెంగా గేమ్ రైతులతో ఆడిపించి తగిన సూచనలు చేసి ఉత్తమ విత్తనాలు ఎంపిక చేసుకొని మంచి దిగుబడులు సాధించి అధిక లాభాలు పొందాలన్నారు. ఉత్తమ రైతులైన శివంది పెంటయ్య, తిమ్మక్పల్లి దేవదాసు ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో క్షేత్రస్థాయి వ్యవసాయ శాఖ అధికారులు మెట్టు ప్రవీణ్ కుమార్, సంతోష్ కుమార్, కంపెనీ సేల్స్ స్టాఫ్ భానుప్రకాశ్, ప్రకాష్ రెడ్డి, సంగమేశ్వర, నాగప్ప పాల్గొన్నారు.

జీలుగు సాగుతో నేల భౌతిక స్థితి మెరుగు

- వ్యవసాయ అధికారి గోవింద రాజులు

నవతెలంగాణ-దౌల్తాబాద్

రైతులు జీలుగా సాగు చేసుకుంటే నేల భౌతిక స్థితి మెరుగుపడి గుల్లగా మారుతుందని దౌల్తాబాద్ వ్యవసాయాధికారి గోవిందరాజులు అన్నారు. గురువారం ఆయన 'నవ తెలంగాణ'తో మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులకు జీలుగు విత్తనాలు 65 శాతం రాయితీపై రైతు ఆగ్రోస్ సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని రైతులు జీలుగు వేయడం వల్ల ఎకరానికి 10 టన్నుల పచ్చి రొట్టె ఎరువు లభిస్తుందన్నారు. 60 కిలోల నత్రజని, 15 కిలోల భాస్వరం, 50 కిలోల పోటాష్ భూమిలో కలుస్తుందన్నారు. భూమిలో రసాయన ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి హరిత ఎరువులు ఉపయోగ పడతాయన్నారు. కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చుని, చౌడు భూముల పునరుద్ధరణకు ఉపయోగవడతాయన్నారు. ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనం అవసరం ఉంటుందన్నారు.



ఓబీసీ ఆత్మీయ సమ్మేళనానికి బయలుదేరిన నాయకులు

నవతెలంగాణ-ములుగు



గురువారం నాగోల్‌లో జరిగే ఓబిసి సమ్మేళనానికి ములుగు మండలంలోని ఓబీసీ మండల అధ్యక్షుడు బబ్బురి స్వామి గౌడ్ అధ్యక్షతన సమ్మేళనానికి బయలుదేరి వెళ్లారు సమ్మేళనంలో బూర నర్సయ్య గౌడ్‌తో కలిసి ఓబీసీల సమస్యలు వివరించారని ఆయన వారితో సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మల్లంపల్లి కనకయ్య యాదవ్, బబ్బురి రవి గౌడ్ హీరోల స్వామి కురుమ తదితరులు పాల్గొన్నారు

సామూహిక ఇంకుడు గుంత పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని తోర్నాల గ్రామంలో మురుగునీరు కోసం సామూహిక ఇంకుడు గుంత పనులను బీఆర్ఎస్ మండల నాయకులు తాళ్లపల్లి బిక్షపతి గౌడ్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందని ఆయన తెలిపారు . గ్రామంలో ఉన్న మురుగునీరు అంతా వృధాగా పోకుండా గ్రామంలో సామూహిక ఇంకుడు గుంత ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మురుగునీరు ఆరు బయట ప్రవహిస్తే దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల పాలవుతారని, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇంకుడు గుంతల పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, టీఏ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, పాల్గొన్నారు.

టీఎన్జీవో రాష్ట్ర నూతన కమిటీని కలిసిన జిల్లా కమిటీ



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ యూనియన్‌కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, కార్యదర్శి మారం జగదీశ్వర్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించినట్లు సంఘం జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్ , కార్యదర్శి కోమండ్ల విక్రమ్ రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహ అధ్యక్షుడు నిమ్మ సురేందర్ రెడ్డి, కోశాధికారి అశ్ఫక్ అహ్మద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సింలు, ఉపాధ్యక్షులు మల్లేశం, సంయుక్త కార్యదర్శి జాబినా సుల్తానా, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, పవన్ కుమార్, లింగం, తిరుపతి, శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీకాంత్, రామ్మోహన్, సాయి రమేష్, సత్యనారాయణ , వెంకట్, రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

నవతెలంగాణ-నంగునూరు



విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పిస్తే నాణ్యమైన విద్య అందుతుందని సర్పంచ్ పంగ కుమారస్వామి, అధ్యాపకుడు నంట శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గురువారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో ఇంటింట తిరుగుతూ తమ కళాశాలలో చేరాలని పదవ తరగతి పాసైన విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విశాలమైన ల్యాబ్ సౌకర్యంతో పాటు సుశిక్షితులైన అధ్యాపకులు బోధన చేస్తారని, స్కాలర్ షిప్, పుస్తకాలు ఉచితంగా అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దరిపల్లి నగేష్, రేవంత్, కొమురయ్య, వేల్పుల అయిలయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహం



నవతెలంగాణ-ములుగు:

మండలంలోని తునికి బొల్లారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి ర్యాంకులో పాస్ అయిన విద్యార్థినులను పీఏసీఎస్ వైస్ చైర్మెన్ నరేష్‌గౌడ్ గురువారం శాలువాలతో సన్మానించారు. పూజ 9.2 జీపీఏ , కే రేణుక 8.7 జీపీఏ, శిరీష 8.5 జీపీఏ సాధించిన వారికి తన వంతుగా రూ.4000 ల చొప్పున నగదును అందజేశారు. అలాగే తునికి బొల్లారం గ్రామానికి చెందిన కృపావతికి ఎంబిబిఎస్‌లో ఫ్రీ సీటు సాధించినందుకు గాను ఆర్థిక ప్రోత్సాహకంగా రూ.5000ల నగదును అందజేశారు ఈ సందర్భంగా నరేష్ గౌడ్ మాట్లాడుతూ భవిష్యత్తులోనూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజేశ్వర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగు విత్తనాలు

నవతెలంగాణ-నంగునూరు: నంగునూరు మండలం ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో సబ్సిడీతో జీలుగా, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి గీత గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తనాలు 65 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తుందని మిగతా 35 శాతం చెల్లించి రైతులు తీసుకోవాలన్నారు. ఆయిల్ పామ్ సాగుచేసే మొక్క చుట్టూ పచ్చి రొట్ట విత్తనాలను చల్లాలన్నారు.ఆయిల్ పామ్ మొక్కలకు పోషకాలను అందించడంతో పాటు కలుపును నివారించడంలో తొడ్పడుతుందన్నారు. జీలుగా 30 కిలోలు రూ. 843, జనుము 40 కిలోలు రూ. 1225 లు చెల్లించాలన్నారు. పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను అందజేయాలని కోరారు. వరి,ఆయిల్ పామ్ పంటలను సాగుచెసే రైతులు పచ్చి రొట్ట పంటలను వేసుకోవాలని సూచించారు.

ప్రారంభమైన జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్





నవ తెలంగాణ మెదక్ టౌన్

జిల్లా నూతన పోలీస్ గ్రౌండ్‌లో డిస్ట్రిక్ట్ పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్ పి రోహిణి ప్రియదర్శిని హాజరయ్యారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. తూప్రాన్ సబ్ డివిజన్, మెదక్ సబ్ డివిజన్, ఏ ఆర్ హెడ్ క్వార్టర్ తో స్పోర్ట్స్ కమాండర్ అచ్యుతారావు ఆధ్వర్యంలో స్పోర్ట్స్ పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాకీ బట్టలతో నిత్యం పని ఒత్తిడిలో పరుగులు తీసే పోలీసులు ఆ పనులు పక్కన పెట్టి ఆటలాడేందుకు మైదానంలో దిగారన్నారు. డిఎస్పీ, సిఐ, ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, హెూంగార్డ్ హెూదాలను పక్కన పెట్టి తమ జట్టును గెలిపించుకునేందుకు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. పోలీస్ సిబ్బంది శాంతి భద్రతల పరిరక్షణతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. నిత్యం పని ఒత్తిడిలో విధులకు హాజరయ్యే పోలీసులకు మానసిక ప్రశాంతత కోసం స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పరితపిస్తున్న పోలీసులకు ఆట పోటీలు నూతన ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. వార్షిక క్రీడలు పోలీసులకు ఉపశమనాన్ని కలిగిస్తాయన్నారు. గెలుపు ఓటములు సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం ఉల్లాసం ఉత్సాహానికి క్రీడలం దోహల పడతాయన్నారు. సమాజంలో పోలీసు పాత్ర అనేది అత్యంత కీలకమన్నారు. స్పోర్ట్స్ మీట్ ప్రారంభ సూచికగా శాంతి కపోతాలను గాల్లోకి వదిలారు. పోలీస్ అధికారులు సిబ్బందికి మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ స్పోర్ట్స్ మీట్ లో కబడ్డీ, వాలీబాల్, 100 మెట్ల పరుగు పందెం, 200 మీటర్ల పరుగు పందెం, 4-100 రిలే, టగ్ ఆఫ్ వార్, షాట్ పుట్, షటిల్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నారని తెలిపారు. మొదటి రోజు పోటిల్లో భాగంగా 31-26 పాయింట్ లతో గెలుపొందింది అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డిఎస్పి లు సైదులు, యాదగిరి రెడ్డి, ఏ ఆర్ డిఎస్ పి శ్రీనివాస్, అచ్యుత్ రావు, నాగేశ్వరరావు, సిఐలు, ఎస్సైలు, ఏఆర్ ఎస్ఐ లు, పిడి లు శ్రీనివాసరావు, మధుసూదన్, రవీందర్ రెడ్డి, వినోద్ కుమార్, పిఈటి మధు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవ తెలంగాణ మెదక్ టౌన్

బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్, హర్యానా మంత్రి సందీప్ సింగ్‌లను అరెస్టు చేయాలని కోరుతూ మెదక్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. భారత మహిళా రెజ్లర్ లను బీజేపీ ఎంపీ, సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్ లైంగికంగా వేధించి అనేక ఇబ్బందులు పెట్టారని, వారిని అరెస్టులు చేసి రెజ్లర్ డిమాండ్ వెంటనే పరిష్కారం చేయాలని పోస్ట్ ఆఫీస్ చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బేటి బచావో బేటి పడావో మాటలు ఆచరణలో చూపకుండా బిజెపి నాయకులు నరరూప రాక్షసులుగా వ్యవహరిస్తున్నారన్నారు. మోడీ నిర్లక్ష్యం వల్ల అనేక రాష్ట్రాల్లో మహిళల పట్ల చాలా చులకన భావంతో వ్యవహరిస్తున్నారన్నారు. బిజెపి సిద్ధాంతం మనుధర్మ సిద్ధాంతం అని మహిళలు ఇంటికే కట్టు బానిసలుగా ఉండాలని తెలియజేసే మనుధర్మ సిద్ధాంతాన్ని బిజెపి పాటిస్తున్నదని స్పష్టం చేశారు. బిజెపిని భారతదేశం నుండి పూర్తిగా తిరస్కరించాలని, మహిళలకు రక్షణ కల్పించే ప్రభుత్వాలను ఎన్నుకుంటేనే తప్ప మహిళలకు రక్షణ దొరకదని వాపోయారు. రాబోయే ఎన్నికల్లో బిజెపిని మహిళలు తిరస్కరించాలని తెలిపారు. భారత రెజ్లర్ పోరాటానికి ప్రజానికం పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని, బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకొని భారత రెజ్లర్ల డిమాండ్లను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించే విధంగా ప్రజలు జాగ్రత్తగా వహించాలని తెలియజేశారు. రాబోయే రోజుల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన బిజెపి అవలంభిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలు, ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి బిజెపిని ఓడించడానికి ఐక్యంగా ముందుకు వెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కార్యదర్శి బసవరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, ఐద్వా నాయకులు మమత, కెవిపిఎస్ నాయకురాలు గీత తదితర నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మామిడి కాయల వాహనం బోల్తా



నవతెలంగాణ జోగిపేట : మామిడి కాయల లోడ్ తో వెళుతున్న డిసిఎం వాహనం టైర్ పేలి అదుపుతప్పి డివైడర్ ను ఢీకొని బోల్తా పడింది. నారాయణఖేడ్ వైపు నుంచి వస్తున్న వాహనం హైదరాబాద్ వెళుతుండగా అందోల్ మండలం కంసాన్పల్లి వద్ద బోల్తా పడింది. డ్రైవర్ కు తీవ్రగాయాలు,జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు.

కళ్ళు బాగుంటేనే మనం బాగుంటాం



నవతెలంగాణ-చేగుంట

తెలంగాణ ప్రభుత్వ లక్ష్యసాధనలో భాగంగా అంధత్వాన్ని పారదోలాలని రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించిందని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సోముల తండా ప్రాథమిక పాఠశాలలో గురువారం రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కంటి వెలుగు పరికరాలను, రిజిస్టర్ ఆధార్ కార్డు నమోదులను, కంటి అద్దాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాసుల శ్రీనివాస్ మాట్లాడుతూ పేదరికంలో ఉన్న ప్రజలకు కూడా నాణ్యమైన అత్యాధునికమైన చికిత్స అందించేందుకుగాను కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. కంటి అద్దాలకు ,వైద్య పరీక్షలకు, శస్త్ర చికిత్సలకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే చూసుకుంటుందన్నారు. కళ్ళు బాగుంటానే మనమందరం బాగుంటామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు ప్రోగ్రాంని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు . ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బింగి గణేష్, సర్పంచ్ జాకి, నాయకులు బీక్య నాయక్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యాధికారిని సన్మానించిన సర్పంచ్



నవతెలంగాణ-చేగుంట

మెదక్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం వైద్య అధికారి చందునాయక్‌ను చేగుంట మండలం చందాయిపేట గ్రామ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంతోష్ కుమార్, టీఎన్‌జీఓఎస్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అనురాధ, పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



నవ తెలంగాణ కొండపాక

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆరేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లడే నర్సింగరావు డాక్టర్ నడుపుకుంటూ తన వ్యవసాయ పొలం వద్దకు వెళుతుండగా పొలం గట్టుపై అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడడంతో ట్రాక్టర్ కిందపడి ఆయన అక్కడికక్కడే మృతి చెందారు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజు తెలిపారు

టీ అండ్ స్నాక్స్ , జ్యూస్ పాయింట్ ప్రారంభించిన సర్పంచ్



నవతెలంగాణ-చేగుంట

నేడు ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాల మీదే ఆధారపడి ఉండకుండా నిరుద్యోగులు వ్యాపారాలు పెట్టుకొని తమ సొంత కాళ్లపై నిలబడడం సంతోషకరమని స్థానిక సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ అయిత వెంకటలక్ష్మిలు అన్నారు. చేగుంట పట్టణ కేంద్రంలో ఎన్జీవోఎస్ కాలనీకి వెళ్లే రోడ్డు పక్కన టి అండ్ స్నాక్స్, జ్యూస్ పాయింట్లను గురువారం హెూటల్ యజమాని విప్లవత్ నారాయణ, వంశీలతో కలిసి ప్రారంభించారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులు ఇంట్లో కూర్చుండి ఉద్యోగాలు రాక వాటికోసం ఎదురు చూడకుండా,తమ సొంత కాళ్లపై వ్యాపారాలు చేసుకుంటూ తల్లితండ్రులకు భారం కాకుండా ఉండాలన్నారు. కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవడానికి యువత, సబ్సిడీపై లోన్లు తీసుకొని వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్నారన్నారు. అనంతరం టీ పాయింట్ యజమాని అభినందించారు. ఈ కార్యక్రమంలో మహేందర్, కుటుంబ సభ్యులు శిల్ప, శాంతాబాయి, పరుశురాం, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులు రవి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మండల ర్యాంక్ విద్యార్థిని సన్మానించిన ఎంపీపీ



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం చందాయిపేట ఉన్నత పాఠశాలలో బోర్ర సాయిరాం అనే విద్యార్థికి ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాలలో 10/10 సాధించి మండల స్థాయి ర్యాంకును సాధించాడు. విద్యార్థి సాయిరాంను మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్ సన్మానం చేసి బహుమతిని అందజేశాడు. ఇకముందు కూడా పై చదువులలో మంచిర్యాకులు సాధించాలని ఎంపిపి శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అయిత వెంకటలక్ష్మి, చందాయ్ పేట సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజు, ఉప సర్పంచ్ సంతోష్ కుమార్, తండ్రి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సీడ్స్ దుకాణాల్లో తనిఖీ

నవ తెలంగాణ - న్యాల్ కల్



ఫర్టిలైజర్ సీడ్స్ దుకాణ దారులు విత్తనాలు ఎరువులు నాణ్యత లేనివి అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి లావణ్య హెచ్చరించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. న్యాల్‌కల్‌లో ఫర్టిలైజర్‌లను తనిఖీ చేశారు. దుకాణాల్లో ఏదైనా కొన్న కూడా రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవ తెలంగాణ- దౌల్తాబాద్

మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన దివ్యాంగుడు వెంకటేష్ పిల్లలకు గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు కొంత మంది దాతలు రూ.41 వేల ఆర్థిక సహాయం అందజేశారు. రూ.10 వేలు దహన సంస్కారాలకు అందజేశారు. గురువారం రూ.31 వేలను వెంకటేష్ కూతుర్లకు సుకన్య సమృద్ధి యోజన పథకంలో జమ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల కుమార్, సంబగ యాదగిరి గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్స్ వీరాం స్వామి, సంబగ స్వామి పోతరాజు, రాజు, భాస్కర్, భరత్, రాజు తదితరులు పాల్గొన్నారు.